




జైజై గణేషా

జైజై గణేషా.. అంటూ భక్తులు భక్తి, శ్రద్ధలతో గణనాథుడిని పూజిస్తున్నారు. గణపతి నవ రాత్రుల్లో భాగంగా మూడో రోజు శుక్రవారంనాడు జిల్లాలోని వినాయక మండపాల వద్ద సందడి నెలకొంది. గణ నాథులకు అలంకరణలు, భక్తుల ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆయా మండలాల్లోని గ్రామాల్లో యువత ప్రత్యేక ఆసక్తితో ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పిఠాపురం అగ్రహారం పశువుల సంత సమీపంలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీరిన కేదార్‌నాథ్ కొండపై శివుడితో వినాయకుడు



బస్సెక్కిన మహిళా నేతలు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతం అయిన సందర్భంగా శుక్రవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నుంచి అన్నవరం వరకు విజయోత్సవ బస్సు యాత్ర నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలతో ఈ ర్యాలీ అన్నవరం వరకు కొనసాగింది.

ప్రత్తిపాడునుంచి అన్నవరం వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ ఐడీ కార్డు చూపిస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ, టీడీపీ మహిళా నేత పావని

బార్లా రాలేదు

- జిల్లాలో బార్ల లైసెన్సు దరఖాస్తులకు స్పందన అంతంతే
- మొత్తం 17 బార్లకు నాలుగింటికే దరఖాస్తులు
- దాఖలైన నాలుగు కాకినాడ కార్పొరేషన్ పరిధిలోనే..

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

జిల్లాలో బార్ల లైసెన్స్‌లకు దరఖాస్తులు అంతంతమాత్రంగానే దాఖలయ్యాయి. తొలివిడత జారీచేసిన నోటిఫికేషన్‌కు పెద్దగా స్పందన రాకపోవడంతో అధికారులు మళ్లీ గడువు పొడిగించారు. దీంతో అప్పటికైనా వ్యాపారులు పోటీపడకపోతారా అని భావిస్తే చివరకు రెండోసారీ షాక్ తగిలినట్లయింది. దీంతో జిల్లాలో 17బార్ల కేటాయింపునకు దరఖాస్తులు ఆహ్వానిస్తే కేవలం నాలుగంటే నాలుగు బార్లకు మాత్రమే వ్యాపారులు ముందుకు వచ్చారు. మిగిలిన 13 బార్లకు ఒక్కరంటే ఒక్కరు కూడా ఆసక్తి చూపలేదు. దీంతో ఇవన్నీ పక్కన పడేసి కేవలం నాలుగు బార్లకు మాత్రమే నేడు జిల్లా కలెక్టరేట్‌లో అధికారులు డ్రా ద్వారా బార్లు కేటాయించనున్నారు. వాస్తవానికి జిల్లాలో బార్ల వ్యాపారం అంటే కోట్లలో సంపాదన. ఒక్క బారు దక్కించుకుంటే చాలు దశతిరిగిపోతుందనుకునే మద్యం వ్యాపారులు చాలామంది ఉన్నారు. మద్యం దుకాణాలకు పర్మిట్లు ఇవ్వడం, లైసెన్సు ఫీజులు, దరఖా స్తు ఫీజులు భారీగా ఉండడంతో తొలిసారి జిల్లాలో బార్లకు కనీస పోటీ లేని పరిస్థితి నెలకొంది.

గడువు పొడిగించినా ప్చ్..

జిల్లాలో ప్రస్తుతం ఉన్న బార్లకు లైసెన్సు గడువు ముగియడంతో ఎక్సైజ్ అధికారులు మూడేళ్ల వ్యవధికి కొత్తగా బార్ పాలసీ ఖరారు చేస్తూ లైసెన్సులు కేటాయించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు ఈనెల 18న జిల్లాస్థాయిలో గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీని ప్రకారం జిల్లాలో 15 బార్లు సాధారణ కేటగిరీలోను, రెండుబార్లు కల్లుగీత కార్మికులకు కేటాయించారు. సాధారణ కేటగిరీ బార్లకు దరఖాస్తు ఫీజు రూ.5లక్షలు, లైసెన్సు ఫీజు రూ.55 లక్షలుగా ఖరారు చేశారు. సాధారణ కేటగిరీలో బార్ల లైసెన్సులకు దరఖాస్తులు కనీసం నాలుగు రావాలని నిబంధన విధించారు. అంతకంటే తక్కువ వస్తే డ్రా తీయకుండా రద్దు చేస్తామని ప్రకటించారు. వచ్చిన నాలుగు దరఖాస్తుల్లో డ్రా తీసి ఒకరిని ఎంపిక చేస్తామన్నారు. అందులోభాగంగా కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 11బార్లకు, సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం, తుని మున్సిపాల్టీల్లో చెరో బారుకు లైసెన్సులు కేటాయించడానికి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈనెల 26తో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల దాఖలుకు గడువు విధించారు. అన్ని రకాల మద్యం నచ్చిన ధరలకు విక్రయించుకునే వీలు బారు వ్యాపారులకు ఉండడంతో పోటీ భారీగా ఉంటుందని అధికారులు భావించారు. తీరా చూస్తే ప్లాన్ బెడిసికొట్టింది. తీవ్ర పోటీ ఉందనుకుంటే ఒక్కరంటే ఒక్క వ్యాపారి కూడా బార్ల కోసం దరఖాస్తు చేయకపోవడంతో అవాక్కయ్యారు. దీంతో చేసేదిలేక మళ్లీ ఈనెల 29వరకు గడువు పొడిగించారు. ఈదఫా అయినా పోటీ ఎక్కువగా ఉండి దరఖాస్తులు అధికంగా వస్తాయని లెక్కలేశారు. తీరా చూస్తే రెండోసారి కూడా దరఖాస్తులు అంతంతమాత్రంగానే వచ్చాయి. కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 11 బార్లకు లైసెన్సులు ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తే కేవలం మూడంటే మూడు బార్లకు మాత్రమే ఒక్కోదానికి నాలుగు చొప్పున అప్లికేషన్లు వచ్చాయి. మిగిలిన 8 బార్లకు నాలుగు దరఖాస్తుల నిబంధనలో ఆరింటికి కనీసం ఒక్క వ్యాపారి కూడా అప్లికేషన్ వేయలేదు. రెండింటికి మాత్రం చెరో దరఖాస్తు వచ్చింది. అటు పిఠాపురం, పెద్దాపురం, తుని, సామర్లకోటలో బార్లకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. జిల్లాలో కల్లుగీత కార్మికులకు కాకినాడ కార్పొరేషన్ పరిధిలో ఒకటి, గొల్లప్రోలులో మరొక బారు కేటాయించారు. ఇందులో కార్పొరేషన్ పరిధిలో బార్‌కు వార్షిక లైసెన్స్ ఫీజు రూ.27.50లక్షలు, గొల్లప్రోలు బారుకు రూ.17.50లక్షలు ఖరారు చేశారు. వీటిలో కార్పొరేషన్ పరిధిలో బారుకు మాత్రమే నలుగురు వ్యాపారులు దరఖాస్తులు అందించారు. దీంతో జిల్లాలో మొత్తం 17 బార్లకుగాను నాలుగింటికి మాత్రమే దరఖాస్తులు వచ్చాయి.

నాలుగు బార్లకు నేడు డ్రా

నాలుగు బార్లకు నేడు కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 8గంటలకు అధికారులు డ్రా తీయనున్నారు. కాగా బార్లకు భారీగానే లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది. ఇందులో మద్యం నచ్చిన ధరలకు విక్రయించుకునే వీలుండడం, లోపలే రెస్టారెంట్ నిర్వహించుకునే అవకాశం, అర్ధరాత్రివరకు బారు తెరిచి ఉంచేందుకు ఇటీవల ప్రభుత్వం అనుమతి మంజూరుతో ఈ వ్యాపారంలో తలపండిన వ్యాపారులు వీటిని దక్కించుకునేందుకు ముందే ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. కానీ ఒక్కో బారుకు కచ్చితంగా నాలుగు దరఖాస్తులు వస్తేనే డ్రా తీస్తామని అధికారులు ప్రకటించడం, దరఖాస్తు ఫీజు రూ.5లక్షలు తిరిగి ఇవ్వబోమని చెప్పడంతో చాలామంది తటపటాయించారు. వార్షిక లైసెన్స్‌ఫీజు రూ.55లక్షలు ఉండడం,అది ఏటా పదిశాతం పెంచుతామనడం ఈ దఫా బార్లకు పోటీలేకుండా చేసింది. బార్ల తరహాలోనే ప్రైవేటు మద్యం దుకాణాలకు ఎక్సైజ్‌శాఖ పర్మిట్‌రూంలకు అనుమతివ్వడంతో మందుబాబులు బార్లకురారనే అనుమానాలు వ్యాపారులు ముందుకు రాకపోవడానికి కారణమంటున్నారు.

పాస్.. కాలేదు!



తప్పుల తడకగా పాస్ పుస్తకాలు

(కాకినాడ/సామర్లకోట, ఆంధ్రజ్యోతి)

పట్టాదారు పాసుబుక్‌లకు ఎదురుచూస్తున్న రైతులకు మళ్లీ నిరాశే మిగిలింది. గత వైసీపీ హయాం నుంచీ వీటికోసం అన్నదాతలు తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగని రోజు లేదు. ప్రభుత్వం మారాక ఎట్టకేలకు కొత్త పుస్తకాలు ముద్రణ పూర్తయి జిల్లాకు చేరుకున్నాయి. రేపో మాపో పుస్తకం చేతికి వస్తుందనుకున్న తరుణంలో వాటిలో చోటుచేసుకున్న భారీ తప్పులు అధికారులు, కొన్నిచోట్ల రైతులు గుర్తించారు. దీంతో అధికారులు వెనక్కు పంపేశారు. ఆన్‌లైన్‌లో వివరాలు సరిచేసి పంపుతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు చేరుకున్న 3.44 లక్షల పాస్‌బుక్‌ల పంపిణీ నిలిపివేశారు.

- ఉమ్మడి జిల్లాకు 3.44 లక్షలు
- 40 వేల పుస్తకాల్లో అన్నీ తప్పులే
- పంపిణీ తాత్కాలిక వాయిదా
- రైతాంగానికి మళ్లీ నిరాశ
- ఆన్‌లైన్‌లో సరిచేస్తున్న అధికారులు
- మార్చి కొత్తగా ఇవ్వాలని నిర్ణయం
- గత వైసీపీలో జగన్ బొమ్మ
- కూటమిలో ప్రభుత్వ రాజముద్ర

40 వేల పుస్తకాలు వెనక్కి..

కాకినాడ జిల్లాలో 6,900 పాస్ పుస్తకాలు తప్పులు తడకగా మారాయి. ఉమ్మడి జిల్లా అంతా కలిపి 40 వేల వరకు పుస్తకాలు ఎందుకు పనికిరాకుండా మారాయి. ఇప్పటికే లాంఛనంగా పంపిణీ చేసిన చోట తప్పులు చూసి అన్నదాతలు లబోదిబోమనడంతో అవన్నీ వెనక్కు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వీటి పంపిణీని తాత్కాలికంగా వాయిదా వేసింది. తప్పులు దొర్లిన పాసు పుస్తకాలన్నింటినీ తాజాగా అమరావతికి వెనక్కు పంపేసింది. ఏ రైతు పుస్తకానికి సంబంధించి తప్పులున్నాయో వాటిని ఆన్‌లైన్ యాప్ ద్వారా సరిదిద్దుతున్నారు.ఈ వివరాల ఆధారంగా మళ్లీ కొత్త పుస్తకాలు రానున్నాయి. అన్ని వివరాలు సక్రమంగా ఉన్న పాసు పుస్తకాల పంపిణీ ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. త్వరలో ఎమ్మెల్యేల ద్వారా పంపిణీ చేయించాలని భావిస్తోంది.

వైసీపీలో ఇబ్బందే..

గత వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ అస్తవ్యస్తంగా మారింది. రైతులు భూములు కొనుగోలు చేసి ఏళ్లు దాటినా కనీసం పాస్ బుక్‌లు ఇవ్వలేదు. వాస్తవానికి పాస్‌బుక్‌లు ఉంటేనే భూముల క్రయవిక్రయాలు, రైతులకు రుణాలు వస్తాయి. కానీ జగన్ సర్కారు అప్పట్లో ఇదేదీ పట్టించుకోలేదు. రైతులు పాస్‌పుస్తకాలకు తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఖాతరు చేయలేదు. అదే సమయంలో అప్పటి ప్రభుత్వం కొత్తగా 2022 సమగ్ర భూ సర్వే చేపట్టి అరాచకం సృష్టించింది. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు భూముల సర్వే 1920లో జరిగింది. దీని ప్రకారమే 2022 వరకు భూ క్రయవిక్రయ లావాదేవీలు జరిగాయి. 1920లో జరిగిన భూసర్వే 30 ఏళ్ల పాటు మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలి. ఆ తర్వాత మళ్లీ భూ రీసర్వే జరగాలి. కానీ అనేక కారణాలతో సర్వే జరగలేదు. వందేళ్ల తర్వాత గత వైసీపీ ప్రభుత్వం సర్వేశాఖ ద్వారా సమగ్ర భూ సర్వే చేయడానికి కసరత్తు జరిపింది. ఒక్కో సర్వే నెంబర్‌లో ఎంత మందికి భూములున్నాయనేది గుర్తించి సబ్‌డివిజన్ సర్వే నెంబర్ కొత్తగా కేటాయించాలని నిర్ణయించింది. కానీ ఆచరణలో అప్పటి ప్రభుత్వం విఫలమైంది. సర్వేపై విపరీతమైన ఒత్తిళ్లు తేవడంతో రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు అస్తవ్యస్తంగా ఈ ప్రక్రియను మార్చేశారు. ఉమ్మడి జిల్లాలో 600కు పైగా గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు. ఇందులో కాకినాడ జిల్లా 15 మండలాల పరిధిలో 269 గ్రామాలు, తూర్పుగోదావరి జిల్లా 19 మండ లాల్లో 190 గ్రామాలు, కోనసీమ జిల్లాలో 150కిపైగా గ్రామాల్లో సర్వే చేశారు. రీసర్వే తప్పుల తడకగా మారింది. వీటిని సరి చేయాలని ఉమ్మడి జిల్లాలో వేలాది మంది బాధితులు కాళ్లరిగేలా తిరిగినా ప్రభుత్వం పరిష్కరించలేదు. ఇదిలా ఉండగా సర్వే పూర్తయిన గ్రామాల్లో సొంత ప్రచారం కోసం జగన్ బొమ్మతో పాస్‌బుక్‌ల జారీకి అధికారులు ప్రయత్నించారు. ఇది కూడా తీవ్ర విమర్శలపాలైంది.

పొరపాట్లను సరిచేశారనుకుంటే..

ఈ పొరపాటును ప్రస్తుత కూటమి ప్రభుత్వం సరిదిద్దింది. కేవలం రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలను ముద్రించింది. ఇలా ఉమ్మడి జిల్లాకు కొత్తగా 3.44 లక్షల పాసు పుస్తకాలు వచ్చాయి. వీటిని తహశీల్దార్లు పరిశీలించి ఆగస్టు 15 నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించారు. వీటిలో తప్పులు దొర్లాయని కొందరు వీఆర్వోలు గుర్తించి తహశీల్దార్ల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు రాష్ట్రస్థాయిలో సమాలోచనలు చేశారు. అనంతరం ఆగస్టు 15 నుంచి భూయజమానులకు పంపిణీ చేయాల్సిన పాసుష్తకాల పంపిణీ కొంతకాలం వాయిదా వేశారు. ప్రభుత్వం ముందుగా నిర్ణయించిన సమాచారం మేరకు ఇప్పటికే పది రోజుల సమయం దాటి పోయింది. అయినా కొత్త పాసుపుస్తకాలు ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారో ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో జిల్లాలోని అన్ని తహశీల్దార్ల కార్యాలయాల్లో కొత్త పాస్ పుస్తకాలు తాత్కాలికంగా దాచి ఉంచారు.

ఇలా చేస్తే బెటర్..

వైసీపీలో రీసర్వే ప్రక్రియలో నాటి వీఆర్వోలు చేసిన తప్పిదాల కారణంగా పాసుపుస్తకాల్లో తప్పులు దొర్లాయి. ఇలా పునరావృత్తం కాకుండా ఉండాలంటే భూయజమానుల పేర్లు, రెవెన్యూ రికార్డులు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశాలను థర్డ్ పార్టీ అధికారులతో సర్వే చేయిం చాలి. గతంలో వీఆర్వో ఫొటోతో కూడిన 1-బీ పత్రాలను రైతులకు పంపిణీ చేసేవారు. రైతుల నుంచి వాస్తవ సమాచార సేకరణ చేసేవారు. కానీ అలాకాకుండా ఆన్‌లైన్ వెబ్‌ల్యాండ్‌లో ఉన్న లోపాలతో ఉన్న పాసు పుస్తకాలను ము ద్రించి వాటినే తిరిగి పంపిణీ చేయడంతో తప్పుల తడకగా మారుతున్నాయి. ఆ ప్రక్రియకు వీఆర్వోలను వినియోగించకూడదని, రెవెన్యూలో సుదీర్ఘ అనుభవంగల ఒక తహశీల్దార్ స్థాయి అధికారి తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో సక్రమంగానే ఉన్నట్టు బయోమెట్రిక్ వేసిన రైతులకే పట్టా దారుపాసు పుస్తకాలు థర్డ్ పార్టీ అధికారులతోనే పంపిణీ చేయించాలంటున్నారు. తాజాగా వచ్చిన కొత్త పాసుపుస్తకాలు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ముద్రితమయ్యాయి.కొత్త పాసు పుస్తకాల్లో రైతు పొలం వద్దకు చేరేలా క్యూఆర్ కోడ్ ముద్రించడం విశేషం.

'పాదగయ'లో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పూజలు



పాదగయ క్షేత్రంలో రాయపాటి శైలజ

పిఠాపురం,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): పిఠాపురంపట్టణంలోని పాదగయక్షేత్రాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ శుక్రవారం రాత్రి సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి,రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్ర ప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆలయ ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ఆమెకు శేషవస్త్రాలు, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల ఫొటోను అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ వీరభద్రరావు, ఆర్ఆర్‌డీ ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దత్తాత్రేయ, పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ పాల్గొన్నారు.

గృహనిర్మాణ సంస్థ గొడౌన్ల తనిఖీ

గొల్లప్రోలు,ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర గృహనిర్మాణసంస్థకు జిల్లావ్యాప్తంగా ఉన్న గొడౌన్లలో తనిఖీలు ప్రారంభమయ్యాయి. గొల్లప్రోలులోని గొడౌన్‌ను హౌసింగ్ జిల్లా పీడీ సత్యనారాయణ శుక్రవారం తనిఖీ చేసి రికార్డులు, స్టాకు పరిశీలించారు.ఆయన వెంట హౌసింగ్ డీఈ శ్రీనివాస్ ఉన్నారు.



గొడౌన్‌ను తనిఖీ చేస్తున్న హౌసింగ్ పీడీ

నేటి నుంచి..
స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ

- జిల్లాకు చేరుకున్న 6,36,238 రేషన్‌కార్డులు
- ఎమ్మెల్యేల సమక్షంలో లబ్ధిదారులకు అందజేత

కలెక్టరేట్(కాకినాడ),ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నుంచి స్మార్ట్ రైస్‌కార్డులు (స్మార్ట్ రేషన్‌కార్డులు) పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లాకు 6,36,238 స్మార్ట్ రైస్ కార్డులు వచ్చాయి. వీటిని చెన్నై నుంచి నేరుగా వాహనాల ద్వారా ఆయా మండలాల తహసీల్దారు కార్యాలయాలకు చేరవేశారు. వీటిని స్థానిక ఎమ్మెల్యేల సమక్షంలో సచివాలయ సిబ్బంది, రేషన్‌డీలర్లు పంపిణీ చేస్తారు. దీనిలో గండేపల్లి మండలానికి 18,119, గొల్లప్రోలు 24,869, జగ్గంపేటకు 26572, కాజులూరుకు 22,233, కాకినాడ రూరల్‌కు 48,854, కాకినాడ అర్బన్‌కు 78,212, కరప మండలానికి 25,552, కిర్లంపూడి 15,594, పెదపూడికి 39,091, పిఠాపురానికి 39,589, ప్రత్తిపాడుకు 25,841, రౌతులపూడికి 16,942, సామర్లకోటకు 43,291, శంఖవరానికి 17,458, తాళ్లరేవుకు 27,050, తొండంగికి 28,374, తునికి 40,036, యు.కొత్తపల్లికి 27,358, ఏలేశ్వరానికి 23,587 స్మార్ట్ రైస్ కార్డులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి రుద్రరాజు సత్యనారాయణరాజు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ శనివారంనుంచి పంపిణీ ప్రారంభం అవుతుందన్నారు. స్మార్ట్ రైస్‌కార్డులు ఆయా రేషన్ డీలర్లకు మ్యాపింగ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ కార్యక్రమం జిల్లాలో విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని ఆయన చెప్పారు.

స్మార్ట్ రైస్‌కార్డులు సక్రమంగా పంపిణీ చేయాలి

- టెలికాన్ఫరెన్స్‌లో ఆదేశించిన జేసీ

కలెక్టరేట్(కాకినాడ),ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారంనుంచి ప్రారంభమవుతున్న స్మార్ట్‌రైస్‌కార్డుల పంపిణీ సక్రమంగా చేయాలని జేసీ రాహుల్‌మీనా ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌నుంచి శుక్రవారం ఆయన 21మండలాల తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త స్మార్ట్‌రైస్‌కార్డులు పంపిణీ స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో సచివాలయం సిబ్బంది, రేషన్‌డీలర్లు పంపిణీ చేయాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పంపిణీ విజయవంతంగా నిర్వహించాలన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):జాతీయక్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడామైదానంలో జిల్లాస్పోర్ట్స్ అథారిటీ, జిల్లా హాకీ సంఘం, కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్,ధ్యాన్‌చంద్ స్పోర్ట్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. రాష్ట్రహాకీ సంఘం సంయుక్త కార్యదర్శి రవిరాజ్, రగ్బీ జిల్లా సంఘంప్రెసిడెంట్ దొర, గ్రౌండ్‌వాటర్ డీడీ రాధాకృష్ణ, సత్యనారాయణ,రంగరావు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన..
1050 మెట్రిక్ టన్నుల యూరియా

- వచ్చేనెల మొదటివారంలో మరో 1700 మెట్రిక్ టన్నుల రాక

కలెక్టరేట్(కాకినాడ),ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): జిల్లాకు శుక్రవారం మరో 1,050 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. సూరత్ నుంచి వచ్చిన ఈ స్టాక్‌ను ద్వారపూడిలో డౌన్ లోడింగ్ చేశారు. అక్కడినుంచి కాకినాడ జిల్లాలో 80 ప్రాంతాలకు వాహనాల ద్వారా తరలించారు. జిల్లాలో ఉన్న పీఏసీఎస్‌లు, ఆర్ఎస్‌కేలు, ప్రైవేటు ఎరువుల డీలర్లకు సరఫరా చేశారు. వచ్చేనెల 1న 700 మెట్రిక్‌టన్నుల యూరియా జిల్లాకు రానుంది. వచ్చేనెల 3న మరో వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానుంది. యూరియాకు జిల్లాలో ఎక్కువగా డిమాండ్ ఉండడంతో రైతులు ఎరువుల దుకాణాల వద్ద క్యూకడుతున్నారు. ఎప్పుడు వచ్చిన స్టాక్ అప్పుడే విక్రయాలు జరిగిపోతున్నాయి. దీనివల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు పెద్దఎత్తున యూరియాను కేటాయింపులు చేసింది. ఈ నేపథ్యంలో వరుసగా జిల్లాకు యూరియా దిగుమతులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు విజయ్‌కుమార్ ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లాలో యూరియా కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు డెల్టా పరిధిలో ఎకరానికి 15 కిలోల యూరియా చొప్పున మూడుసార్లు కలిపి 45 కిలోల వరకు మాత్రమే చల్లాలన్నారు. మెట్టప్రాంతంలో అయితే ఎకరానికి 20 కిలోల చొప్పున మూడుసార్లు కలిపి 60 కిలోలు మాత్రమే యూరియా పొలాలకు చల్లాలన్నారు. అధిక మోతాదులో యూరియా చల్లడంవల్ల తెగుళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. తెగుళ్లు వస్తే పంటసాగువ్యయం అధికంగా అవుతుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు యూరియాను పంటపొలాలకు చల్లాలన్నారు.

శుక్రవారం కొనసాగిన దాడులు

శుక్రవారం కూడా జిల్లాలో ఎరువుల దుకాణాలపై దాడులు కొనసాగాయి. కత్తిపూడిలో ఒక ఎరువుల దుకాణంపై రికార్డుల్లో వ్యత్యాసాలు నేపథ్యంలో 6ఏ కేసు నమోదు చేశారు. యూరియా కొరత నేపథ్యంలో ఎవరైనా ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.



జిల్లా కేంద్రంలో యూరియా నిల్వలు

పెద్దాపురం సచివాలయ సిబ్బంది అక్రమాలపై విచారణకు ఆదేశం

పెద్దాపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మున్సిపాలిటీ సచివాలయ సిబ్బందిపై శాఖాపరమైన విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2021లో మున్సిపాలిటీలో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాల్లో జరిగిన పలు అవినీతి, అవకతవకలకు సంబంధించి విచారణ చేపట్టనుంది. పట్టణ పరిధిలోని పలు సచివాలయాల్లో పనిచేస్తున్న సచివాలయ ప్లానింగ్ రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందికి సంబంధించి ఈ విచారణ కొనసాగనుంది. ప్లానింగ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు ఆచంట రవి కిరణ్, ఆకుల అపర్ణ కుమారి, అజ్జపు సురేష్‌తోపాటు మరో 25మందిపై ఈ విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. గతంలో టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాల్లో అవినీతి అక్రమాలు జరిగినట్లు పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.జ



తెలుగు.. వెలుగు

తెలుగు భాష మనది.. నిండుగ వెలుగు భాష మనది.. నిజమే మరి.. తెలుగుకు ఎంతో మంది కవులు వన్నెతెచ్చారు.. తేట తేట తెలుగులా అంటూ కీర్తించారు.. ఆ కవులందరినీ ఒకసారి చూడగలమా.. కాస్త కష్టమే..అందుకే అమలాపురం రూరల్ వన్నెచింతలపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని వంద మంది తెలుగు కవుల చిత్రపటాలు మన ముందుకు తెచ్చారు.. తెలుగు కీర్తి చాటారు. - **అమలాపురం రూరల్**

భక్తజన సిద్ధివినాయకుడు



అయినవిల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం భక్తులతో కిక్కిరిసింది. వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సిద్ధివినాయకుడిని దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు ఆలయ ప్రధానార్చకుడు బ్రహ్మశ్రీ మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. లక్ష దూర్వార్చన పూజ నిర్వహించారు.మూషిక వాహనంపై స్వామివారికి మాడవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. మణికంఠ స్వీట్స్ స్వీట్ల వితరణ, చేమకూర శ్రీను, భద్రం బ్రదర్స్‌చే పులిహోర, భావిశెట్టి రాంబాబు, తాతాజీ బ్రదర్స్ చక్కెరపొంగలి ప్రసాదం వితరణ జరిగాయి. కోనసీమ విద్యాశ్రమం(ముక్తేశ్వరం) విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు.

గణేశుడి ప్రతి.. రూపాయలు!

పలు దేశాల నాణేలపై వినాయకుడి ప్రతిరూపాలు

అమలాపురానికి చెందిన కృష్ణ కామేశ్వర్ సేకరణ



ఐవరీకోస్ట్ దేశం ముద్రించిన రావి ఆకుల గణపతి నాణెం



కుక్ ఐలాండ్స్ దేశం ముద్రించిన బంగారుపూత వినాయకుని నాణెం



గింగీ నాయకులు ముద్రించిన గణపతి రాగినాణెం

అందుగలడు.. ఇందులేడని సందేహము వలదు..ఎందెందు వెతికినా గణేశుడే కదా.. గణపతిపూజ మన దేశానికి మాత్రమే పరిమితం కాలేదు. ప్రపంచంలోని ఎన్నో దేశాల్లో విఘ్నేశ్వరుడు పూజలు అందుకుంటున్నాడని చెప్పడానికి ఆయా దేశాల కరెన్సీ నోట్లపై ఉన్న గణేశుడి రూపమే నిదర్శనం. అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ ప్రపంచ వ్యాప్తంగా గణేశుడి ముఖ చిత్రాలతో విడుదల చేసిన కరెన్సీ నోట్లు, నాణేలు సేకరించారు. పూర్వం నాణేలపై కూడా వినాయకుడి రూపాలే ముద్రించారు. ఇండోనేషియా దేశం ముద్రించిన రూ.20 వేల కరెన్సీ నోట్లపై విద్యాగణపతిని ముద్రించారు. 2013లో ఐవరీకోస్ట్ దేశం ముద్రించిన రావి ఆకుల గణపతి నాణెం నేటికీ ప్రత్యేకమే. ఇక 2018లో తువాలు దేశం నృత్యగణపతి ముఖచిత్రంతో ముద్రించిన అల్యూమినియం, బ్రాంజి, వెండి నాణేలు ఆకర్షణీయంగా ఉన్నాయి. 2019లో కుక్ ఐలాండ్స్ దేశం 93.3 గ్రాముల వెండి నాణెంపై బంగారు పూతతో వినాయకుడి నాణేన్ని ముద్రించారు. 2011లో థాయ్‌లాండ్ దేశం వినాయకుని ముఖచిత్రంతో 10 బాట్ల నాణెం విడుదల చేసింది.1509లో విజయనగర సామ్రాజ్యానికి విధేయులై తంజావూరు, మదురై ప్రాంతాలను పాలించిన గింగీ నాయకులు ఒక కాసు రాగినాణెంపై వినాయకుని ముఖ చిత్రంతో ముద్రించారు. ఇలా ఎన్నో దేశాల్లో గణపతి రూపాలతో కరెన్సీ నోట్లు, నాణేలను ముద్రించారు.

- అమలాపురం రూరల్ -ఆంధ్రజ్యోతి



థాయ్‌లాండ్ ముద్రించిన వినాయకుడి నాణెం



ఇండోనేషియా ముద్రించి రూ.20 వేల నోటు





తువాలు దేశం ముద్రించిన నృత్యగణపతి నాణెం

చనిపోయినా.. చూడొచ్చు!



నేత్రదానంతో అంధులకు వెలుగులు

- ఎవరైనా నేత్రదానం చేయవచ్చు
- అంధులకు చూపు ప్రసాదించవచ్చు
- చనిపోయిన 6 గంటల్లోపే కార్నియా తీయాలి
- నేత్రదాన పక్షోత్సవాలు

అంబాజీపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మనం చనిపోతే మనతో పాటు శరీరం అంతా భూమిలో కలిసిపోవాల్సిందేనా..! మన చనిపోయినా బతికే ఉండొచ్చు..! అదెలాగంటే మన అవయవాలను దానం చేయడం ద్వారా.. సర్వేంద్రియానాం..నయనం ప్రధానం అంటారు.. అందుకే పుట్టుకతో అంధత్వం గల వారితో పాటు పలు కారణాలతో మధ్యలో చూపు కోల్పోయిన వారిని సమాజంలో ఎంతో మందిని చూస్తుంటాం. మరణించిన తర్వాత నేత్రదానం చేసి అటువంటి వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చు. సెప్టెంబరు 8 వరకూ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ప్రత్యేక కథనం...

చిన్న పొరపాటు చాలు..

ఆహారంలో విటమిన్ ఏ, డీ లోపించడం.. పోషకాహార లోపంతో కంటి జబ్బులు వస్తున్నాయని వైద్యులు సూచిస్తున్నారు. కార్నియా అంటే పలుచటి పారదర్శక పొర. ఇది కంటిలో కనుపాప ముందుంటుంది. ఇన్‌ఫెక్షన్ ద్వారా, దెబ్బతగలడం ద్వారా, పోషకాహార లోపంతో ఈ పారదర్శక పొర దెబ్బతిని చూపు మసకబారుతోంది.తెల్లని పొర ఏర్పడడంతో కంటిచూపు కోల్పోతారు. పుట్టుకతోనే(తల్లిగర్భంలో) ఇన్‌ఫెక్షన్ రావడంతో నల్లగుడ్డు ఏర్పడే సమయంలో అది తెల్లబడి ఉంటుంది. వైరల్, ఫంగల్, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్, పసరు కంటిలో పోయడంతో కంటి చూపు దెబ్బతింటుంది. కళ్లను గాయాల నుంచి కాపాడుకోవాలి. కత్తెర, కత్తి, సూది, టపాసులు, యాసిడ్‌లు వంటి వస్తువులు పిల్లలకు అందకుండా ఉంచాలి.

40 వేలే కార్నియాల సేకరణ

ప్రతి ఏటా లక్షలాది కళ్ళు అవసరం ఉండగా కేవలం 40 వేల కార్నియాల సేకరణ మాత్రమే సాధ్యపడుతోంది. కార్నియా జబ్బుతో బాధపడి కంటిచూపు కోల్పోయిన వారు దేశంలో లక్షకు పైగా ఉన్నట్టు అధికార గణాంకాలను బట్టి తెలుస్తుంది.వీరికి కార్నియా మార్పిడి చేస్తే మళ్లీ ఈ అందమైన లోకాన్ని చూసే అదృష్టం కలుగుతోంది.ఆ అదృష్టాన్ని వారికి ఎవరైనా ప్రసాదించవచ్చు.చేయాల్సిందల్లా మన చుట్టూ ఉన్న వారిలో ఎవరైనా చనిపోతే వారి నేత్రాలు దానం చేయడానికి కుటుంబీకులను ఒప్పిస్తే సరి.ఏవయసు వారైనా నేత్రదానం చేయవచ్చు.

నేత్రదానానికి వీరు అర్హులు..

వయసుతో నిమిత్తం లేకుండా ఎవరైనా నేత్రదానం చేయవచ్చు. ప్రమాదవశాత్తు గుండెజబ్బులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మరణించిన వారు, సహజ మరణం పొందిన వారు నేత్రదానానికి అర్హులు.మధుమేహం, రక్తపోటు, వ్యాధిగ్రస్తులు మరణానంతరం నేత్రదానం చేయవచ్చు.ఎయిడ్స్, కుక్కకాటుతో మరణించిన వారు, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలం కోమాలో ఉన్న వారి నేత్రాలు పనికిరావు. ఇతర ఏ వ్యాధులైనా నేత్రదానం చేయవచ్చు. మరణించిన వ్యక్తి నుంచి మాత్రమే నేత్రాలను సేకరిస్తారు.వీటిని సేకరించడానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు ఐ బ్యాంక్‌లు ఏర్పాటు చేశారు.ఈ నేత్రాలను ఉచితంగా వైద్యులు, ఐ బ్యాంక్ టెక్నీషియన్ సేకరిస్తారు. ఒక వ్యక్తి మరణించిన 6 గంటల్లోపు నేత్రాలు సేకరిస్తారు. ఐబ్యాంకులకు సమాచారమిస్తే వారు వచ్చి 10 నుంచి 15 నిమిషాల్లో చనిపోయిన వారి నేత్రాలు సేకరిస్తారు.నేత్రదానం వల్ల అంతిమ సంస్కారాలకు ఎలాంటి ఆటంకం ఉండదు.

బొగ్గుసొరను కాపాడుకుందాం

- తీరప్రాంత మత్స్యకారులకు అటవీశాఖాధికారుల అవగాహన కార్యక్రమాలు



తాళ్లరేవు మండలంలోని తీరప్రాంతంలో బొగ్గుసొర నమూనా

తాళ్లరేవు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో అరుదైన భారీ చేప బొగ్గుసొర ఆవశ్యకతపై అటవీశాఖాధికారులు మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నారు. తీరప్రాంత మండలాల్లోని మత్స్యకార గ్రామాల్లో సముద్రంలో వేటచేసే మత్స్యకారులకు ఆరురోజులపాటు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏటిమొగ కుంభాభిషేకం ప్రాంతంలో అటవీశాఖాధికారులు శుక్రవారం ప్రపంచ బొగ్గసొర దినోత్సవం నిర్వహించారు. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లినప్పుడు సాదు స్వభావంగల బొగ్గుసొరను పట్టడం లేదా వాటికి హాని కలిగించే పనులు చేయడం వంటివి చేయకూడదని సూచించారు. ఇది సముద్రాన్ని శుభ్ర పరుస్తుందని, చేపలవేటకు మత్స్యకారులకు మేలు చేస్తుందని, అందుకని దీన్ని కాపాడేందుకు అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో అటవీశాఖాధికారులు సిద్దార్థ, ధనంజయరావు, మహేష్, గోపి, సంధ్యారాణి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల.. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి

- 1,584మంది అభ్యర్థుల ధ్రువీకరణపత్రాల పరిశీలన
- హాజరుకాని 34మంది అభ్యర్థులకు ఫోన్‌లో సమాచారం
- వారి కోసం తనిఖీ బృందాలకు తప్పని ఎదురుచూపులు



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న విద్యాశాఖ ఏడీ రామలింగం, డీఈవో రమేష్

గొల్లప్రోలురూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మెగాడీఎస్సీ-2025 మెరిట్‌లిస్టులో ఉన్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అభ్యర్థులకు గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండురోజులుగా జరుగుతున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శుక్రవారం అర్థరాత్రి పూర్తయింది. వివిధ కారణాలతో హాజరుకాని 34మంది అభ్యర్థులకు ఫోన్‌లో సమాచారం అందించి వెరిఫికేషన్‌కు రావాలని సూచించి వారి కోసం ఎదురుచూడాల్సి రావడంతో కొంత జాప్యం చోటు చేసుకుంది.

పెరిగిన అభ్యర్థుల సంఖ్య

మెరిట్‌లిస్టులో ఉన్న అభ్యర్థుల ధ్రువీకరణపత్రాల తనిఖీ కోసం ఏర్పాటు చేసిన 25 తనిఖీ బృందాలు రెండురోజులు రాత్రింబవళ్లు ఈ ప్రక్రియలో నిమగ్నమయ్యాయి. గురువారం అర్థరాత్రి దాటిన తర్వాత 2గంటల వరకూ 1,018 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తిచేయగా శుక్రవారం రాత్రి 8గంటలకు హాజరైఉన్న మరో 566మంది అభ్యర్థుల పరిశీలన పూర్తిచేశారు. కాల్‌లెటర్‌లు జనరేట్ అయిన అభ్యర్థుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. శుక్రవారానికి ఈ సంఖ్య 1,351మంది నుంచి 1,618మందికి చేరుకుంది. ఎంఈవో, గెజిటెడ్ హెచ్ఎం, డిప్యూటీ తహసీల్దారు, ఎంఐఎస్ ఆపరేటర్ సభ్యులుగా ఉన్న బృందాలు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన, ఫిజికల్‌గా తీసుకువచ్చిన సర్టిఫికెట్లను పరిశీలించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేశారు.

ఫోన్‌లో సమాచారం

1618మంది అభ్యర్థులకు 1584మంది అభ్యర్థులు మాత్రమే సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. మిగిలినవారు ఆన్‌లైన్‌లో తమకు కాల్‌లెటర్ జనరేట్ అయిన సమాచారం చూసుకోకపోవడం,ఇతర సాంకేతికపరమైన కారణాలతో హాజరుకాలేనట్లు గుర్తించిన అధికారులు వారికి మరొక అవకాశం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. అలా హాజరుకాని 34మంది అభ్యర్థులకు సంబంధించి తమవద్ద ఉన్న వివరాల ఆధారంగా ఫోన్‌చేసి తక్షణం పరిశీలనకు హాజరు కావాలని సమాచారం అందించారు. దీంతో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మారుమూల ప్రాంతాలకు చెందినవారు అప్పటికప్పుడు బయలుదేరారు. వీరికోసం తనిఖీ బృందాలు అర్థరాత్రి వరకూ వేచి చూసి తనిఖీ పూర్తిచేశాయి. తమకు తెలియకున్నా విద్యాశాఖాధికారులు ఫోన్‌లో సమాచారం ఇచ్చి తనిఖీకి రమ్మని చెప్పడంతో సదరు అభ్యర్థులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.

ఉన్నతాధికారుల పరిశీలన

సర్టిఫికెట్ల పరిశీలన రెండు రోజులు తనిఖీ బృందాలతోపాటు విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ మువ్వా రామలింగం, కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్, డీసీఈబీ కార్యదర్శి వెంకట్రావులు అక్కడే ఉండి స్వయంగా పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పరిశీలించారు. వీరికి ఉమ్మడి జిల్లాకు చెందిన డీఈవోలు, డీవైఈవోలు సహకారం అందజేశారు.

56 అక్షరాల వాగ్దేవతా చిత్రపటాల ప్రదర్శన



చెముడలంకలో 56అక్షరాల వాగ్దేవతా చిత్రపటాలతో విద్యార్థులు

ఆలమూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చెముడలంక షిర్డిసాయి విద్యానికేతన్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా జరిపిన ఈ కార్యక్రమంలో 56 తెలుగు అక్షరాల వాగ్దేవతా చిత్రపటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతి అక్షరానికి ఒక అధిదేవత ఉంటుందని, అవన్నీ బీజాక్షరాలని షిర్డిసాయి విద్యానికేతన్ డైరెక్టర్ ఉమారాణి అన్నారు. 56 చిత్రపటాలకు విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు.

కాకినాడ ఆర్ఎంసీలో జీఎన్ఎం నర్సింగ్ పరీక్షల్లో కాపీయింగ్ ఆరోపణలపై విచారణ

జీజీహెచ్(కాకినాడ),ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్ఎంసీలో నిర్వహిస్తున్న జీఎన్ఎం నర్సింగ్ పరీక్షల నేపథ్యంలో జరిగిన కాపీయింగ్ ఆరోపణలపై శుక్రవారం విచారణ జరిగింది. డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీ ఏర్పడింది. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ శశి, నర్సింగ్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమాసుందరి సభ్యులుగా ఈ కమిటీ నడిచింది. ఇందులో 30మందిని విచారించారు. ఇందులో ఇన్విజిలేటర్లు, జీజీహెచ్ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ సహా సీనియర్ అసిస్టెంట్ ఏసుబాబు ఉన్నారు. ఆర్ఎంసీ డైనింగ్ హాల్‌లో ఈ విచారణ జరిగింది. కాపీయింగ్ జరిగిందా లేదా జరిగితే కారణాలు ఏంటన్న కోణంలో విచారణ చేపట్టారు. అనంతరం నివేదికను సీసీ ఫుటేజ్ ఆధారాలతో విచారణ కమిటీ డీఎంఈకి సమర్పించింది.

తెలుగు భాష వ్యాప్తి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది

- ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్
- ఐడియల్ కళాశాలలో ముగిసిన తెలుగు భాషా సాహిత్య ఉత్సవాలు



రచయిత రవి మంత్రిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల, ఐడియల్ కళాశాల కరస్పాండెంట్, డైరెక్టర్

కాకినాడరూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగుభాష వ్యాప్తికోసం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ డిగ్రీ కళాశాలల్లో ఐదురోజులపాటు నిర్వహించిన డాక్టర్ పి.చిరంజీవినీకుమారి స్మారక తెలుగుభాషా సాహిత్య ఉత్సవాలు తెలుగు భాషా దినోత్సవంతో శుక్రవారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో గౌరవఅతిథిగా ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ముఖ్యఅతిథిగా రచయిత రవి మంత్రి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల మాట్లాడుతూ చదువుల్లో భాషకు ప్రాధాన్యం ఉండాలని, తమ తరం విద్యార్థులు మైళ్ల దూరం నడిచి వెళ్లి చదువుకోవాల్సి ఉండేదని, ఇప్పటి విద్యార్థులకు చదువు కోసం అన్ని సదుపాయాలు ఉన్నాయని అన్నారు. అనంతరం రవి మంత్రి మాట్లాడుతూ కొత్త తరం యువతీ, యువకుల్లో తెలుగుభాష, సాహిత్య అధ్యయన స్పృహ పెంచేందుకు తన రచనల ద్వారా కృషి చేస్తున్నానన్నారు. తెలుగు వారి భాష, భావం వెనకబడలేదని, తన నవల లక్షా50వేల కాపీలు అమ్ముడవడమే దీనికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లోని విజేతలకు అతిథులు ప్రతిభా పత్రాలను, బహుమతులను అందజేశారు. స్థానిక సెయింట్ జేవియర్స్ హైస్కూల్ విద్యార్థులు పాటలు, క్విజ్ పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారు. ఐడియల్ కళాశాలల కరస్పాండెంట్, కార్యదర్శి పీఎస్ఎస్ కిరణ్, అకడమిక్ డైరెక్టర్ మెర్ల రంజిత్ అతిథులను, ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ అధ్యక్షత వహించగా పి.పద్మజావాణి, భారత లక్ష్మి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ కేఎస్ వాసు, చింతపల్లి సుబ్బారావు, మార్ని జానకి రామ్‌చౌదరి, పి.సుబ్బారావు, కె.దుర్గాప్రసాద్, శిరీష్ పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా దివ్యాంగుల క్రికెట్ జట్టు ఎంపిక

సామర్లకోట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు ఆదేశాలమేరకు దివ్యాంగుల క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, గ్రామ స్థాయి నుంచి క్రికెట్ క్రీడను అభివృద్ధి చేసేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, దివ్యాంగుల క్రికెట్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబరు 12 నుంచి 14 వరకూ కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల మైదానంలో స్వర్ణాంధ్ర ఇంక్లూసివ్ క్రికెట్ కప్-2025 నిర్వహిస్తున్నట్లు ఏసీఏ దివ్యాంగుల క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ,టోర్నమెంట్ నిర్వహణ కమిటీ కన్వీనర్ చిత్తులూరి వీర్రాజు(రాజా) తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈటోర్నమెంట్‌లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఆతిథ్య జట్టు తూర్పుగోదావరి జట్లు పాల్గొంటాయన్నారు. పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు ఎంపిక 31న కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల గ్రౌండ్‌లో ప్రారంభిస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు మాత్రమే తూర్పుగోదావరి జిల్లా జట్టు తరపున పోటీలో పాల్గొంటారని కన్వీనర్ చిత్తులూరి రాజా తెలిపారు. వివరాలకు 8498877877, 9440121865 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

తేటగుంట కెనరా బ్యాంకు ఎదుట ఖాతాదారుల ఆందోళన

తునిరూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట కెనరా బ్యాంకుకు చెందిన గోల్డ్ అప్రోచర్ రామోజుల రాజశేఖర్ జైలుకెళ్లి బయటకు వచ్చినప్పటికీ తమ బంగారం తమకు ముట్ట లేదని, బ్యాంక్ అధికారులు, గోల్డ్ అప్రోచర్ ఉద్దేశపూర్వకంగానే తమను తప్పుదోవ పట్టిస్తున్నారని ఖాతాదారులు ఆరోపిస్తూ శుక్రవారం తేటగుంట కెనరా బ్యాంకు ఎదుట ఖాతాదారులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. తమ బంగారం ఇచ్చే వరకు కదిలేది లేదంటూ ఆందోళన చేపట్టి బ్యాంక్ అధికారులను నిలదీశారు. గ్రామ సర్పంచ్ అత్తి నాగబాబు ఖాతాదారులకు మద్దతుగా నిలిచి బంగారు ఆభరణాలు కోల్పోయిన బాధితులకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు.


బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

పిచ్చికుక్క స్వైరవిహారం

● పి.గన్నవరంలో ఏడుగురిపై దాడి

పి.గన్నవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. పి.గన్నవరం పెట్రోలు బంకు సమీపంలో వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురిపై కొన్నిగంటల వ్యవధిలో దాడికి పాల్పడింది. గాయపడిన వారిలో జల్లి పుష్పవతి (వై.కొత్తపల్లి), యర్రంశెట్టి సత్యశ్రీరామ్ (పి.గన్నవరం), తోరం సత్యసాయి (వైపీ పాలెం), సీహెచ్ నాగరాజు (పి.గన్నవరం శివారు అంబేడ్కర్ కాలనీ), చుట్టుగుళ్ల శ్రీనివాస్ (పి.గన్నవరం), సీహెచ్ నరసింహం (పి.గన్నవరం)ఉన్నారు. వీరికి పి.గన్నవరం సీహెచ్‌సీలో ఏఆర్‌వీ వ్యాక్సిన్ అందించి ప్రథమ చికిత్స చేశారు. వారిలో ఇద్దరికి బలమైన గాయాలు కావడంతో కొన్ని గంటలపాటు పరిశీలనలో ఉంచినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. కాగా, పి.గన్నవరం, తదితర పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

సత్యదేవుడికి హెలీకాప్టర్ ఫ్యాన్లు అందజేత

అన్నవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అన్నవరంలోని సత్యదేవుడి వార్షిక కల్యాణమండపం వద్ద భక్తులు సేద తీరేందుకు హెలీకాప్టర్ ఫ్యాన్లను శుక్రవారం అమర్చారు. వీటిని లలిత రైస్ ఇండస్ట్రీస్ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ విరాళంగా సమకూర్చారు. వీటివిలువ సుమారు రూ. ఐదు లక్షలు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. అలాగే ప్రసాదం కౌంటర్‌లోని షెడ్డు వద్ద మరో ఫ్యాన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.


వార్షిక కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన ఫ్యాన్లు

చెట్టుకు ఉరి వేసుకుని యువకుడి మృతి

తాళ్లపూడి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి పోలీస్‌స్టేషన్ పరిధి తిరుగుడుమెట్టలో శుక్రవారం ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాళ్లపూడి పోలీసులు తెలిపిన వివరాలివి.. తిరుగుడుమెట్టకి చెందిన సైదుఏసు (26) గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకున్నట్టు సమాచారం అందింది. దీంతో పోలీసులు వెళ్లగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. ఈయనకు ఆరు సంవత్సరాల క్రితం వివాహ మయ్యింది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో కొద్దిరోజుల క్రితం భార్య మృతి చెందింది. దీంతో మానసికంగా బాధపడుతూ ఉండేవాడని ఆయన తల్లి పేర్కొంది. ఆమె ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ టీ. రామకృష్ణ తెలిపారు.


చెట్టుకు వేళాడుతున్న సైదుఏసు మృతదేహం

ప్రతి మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలి

● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ



కాకినాడలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ శైలజ, తదితరులు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ వ్యాపారవేత్తగా, పారిశ్రామికవేత్తగా ఎదిగేలా రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, రక్షణలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కోరారు. కాకినాడ జిల్లాలో శుక్రవారం ఆమె పర్యటించారు. కాకినాడ స్మార్ట్ సిటీ సమావేశ హాలులో ఐసీడీఎస్ విభాగం మహిళాల సంక్షేమం, భద్రత, హక్కులు అంశాలపై నిర్వహించిన జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మహిళా కమిషన్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత, రక్షణ కేవలం ప్రభుత్వం, పోలీసులు ఒక్కరిదే బాధ్యత కాదని, సమాజంలో ప్రతిఒక్కరూ ఈ బాధ్యత స్వీకరించేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం ఎన్ని వనరులు కల్పించినా, పోలీస్ విభాగం ద్వారా శక్తి యాప్, శక్తి టీమ్స్, మహిళా పోలీస్‌స్టేషన్ వంటి ఎన్ని వ్యవస్థలు ఏర్పాటు చేసినా మహిళలపై అక్కడక్కడా లైంగిక వేధింపులు, దాడులు ఇంకా జరుగుతూనే ఉన్నాయని అన్నారు. అవగాహనలోపం వల్లే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని, మహిళాశిశు సంక్షేమశాఖ ద్వారా ప్రతిచోటా, వేసవి సెలవుల్లో కూడా కిశోర వికాశం వంటి కార్యక్రమాల ద్వారా గుడ్ టచ్, బాడ్ టచ్, పోక్సో తదితర చట్టాల గురించి బాలికలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మహిళా కమిషన్ ద్వారా ఈ అవగాహన కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తృతంగా చేపడుతున్నామన్నారు. మహిళల రక్షణ దిశగా కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని, ఇటీవల వెలువడిన జాతీయస్థాయి సర్వేలో వైజాగ్ నగరం దేశంలో బాలికలకు అత్యంత భద్రమైన నగరాల్లో ఒకటిగా పేర్కొనడం మనందరం ఆనందించే అంశమని తెలిపారు. కేవలం వైజాగ్ నగరమే కాకుండా రాష్ట్రంలోని ప్రతి ఊరిని ఆడ పిల్లలకు భద్రమైనదిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మహిళా కమిషన్ పనిచేస్తోందని, ఇందుకు అందరి సహకారం అవసరమని తెలిపారు. ముఖ్యంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఎన్‌జీవో సంస్థలు మంచి విద్య, మార్కుల సాధనతో పాటు సమాజంలో భద్రంగా ఎలా ఉండాలనే అంశంపై ఆడపిల్లలకు అవగాహన కల్పించాలని, మగపిల్లలు సైతం బాలికలు, మహిళలపట్ల మర్యాదగా వ్యవహరించేలా నైతిక శిక్షణ ఇవ్వాలని కోరారు. ఆడబిడ్డలు, మహిళలపై అకృత్యాలు జరిగినప్పుడు, వాటిపై ధైర్యంగా ఫిర్యాదు చేసేందుకు బాధితులు ముందుకు రావాలని, రిపోర్టింగ్ పెరిగి నేరస్తులకు శిక్షలు పడితే, నేర ప్రవృత్తి కలిగిన వారికి వణుకు పుట్టించే గట్టి హెచ్చరికలుగా నిలుస్తాయని, లింగపరమైన నేరాలు తగ్గుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంవల్ల ఎక్కువమంది మహిళలు బయటికి వచ్చి ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని, తద్వారా మహిళా సాధికారత మరింత పెరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మహిళలు కీలక భూమిక వహిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ, ప్రోత్సాహాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కోరారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా

● అమలాపురంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం
●172 మంది క్రీడాకారులు హాజరు



పోటీల్లో పవర్ లిఫ్టింగ్ చేస్తున్న క్రీడాకారులు

అమలాపురం టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలో శుక్రవారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ఆద్యంతం ఉల్లాసంగా .. ఉత్కంఠ భరితంగా జరిగాయి. అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 172 మంది పవర్ లిఫ్టర్లు హాజరయ్యారు. పోటీలను టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు ప్రారంభించారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్త్రీ, పురుష విభాగాల్లో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీలను ఒలింపిక్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి, డీఎస్‌డీవో పీఎస్ సురేష్ కుమార్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్ హాజరై పలు విభాగాల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడపా వెంకటసుబ్రహ్మణ్యం, కల్వకొలను బాబు, రవణం వేణుగోపాల్, ముమ్మిడి ప్రతాప్‌కుమార్, కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠ పోరులో విజేతలు..

ఈ పోటీల విజేతలను కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు శుక్రవారం రాత్రి వెల్లడించారు. 53 కిలోల పురుషుల విభాగంలో పి.వీరేంద్ర (కాకినాడ) ప్రథమ, పి.సూర్యదినేష్ (పి.గన్నవరం) ద్వితీయ, సీహెచ్ సత్యగోపి (అమలాపురం) తృతీయ స్థానాలు సాధించారు. 59 కిలోల సీనియర్స్ విభాగంలో వై.రాజు (రాజమహేంద్రవరం) ప్రథమ, వై.వీరబాబు (పి.గన్నవరం) ద్వితీయ, వి.రవికుమార్ (మురమళ్ల) తృతీయ స్థానాలు సాధించారు. 66 కిలోల విభాగంలో జి.సాయిమణికంఠ (కాకినాడ), కె.నాని (అమలాపురం), జి.ఫణిమధు (రాజమహేంద్రవరం) వరుస స్థానాల్లో నిలిచారు. 66 కిలోల మహిళల విభాగంలో పి.స్పందన (రాజోలు) ప్రథమ, యు.షానిక (రాజోలు) ద్వితీయ, టి.కీర్తి (రాజోలు) తృతీయ స్థానాల్లో నిలిచారు. 66కిలోల పైబడిన విభాగంలో పి.దీవెన (కాకినాడ) ప్రథమ, వై.ఇందిర(అమలాపురం) ద్వితీయ, కె.మంజుల(రాజోలు) తృతీయ స్థానాల్లో నిలిచారు. రాత్రి వరకు పోటీలు కొనసాగుతున్నాయి.



బాలుర విభాగంలో ...

ఉధృతంగా గోదావరి

» కాటన్ బ్యారేజ్ నుంచి 7,52,579 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి విడుదల
» నిలకడగా నీటి మట్టం


ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ఉధృతి

ధవళేశ్వరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉపనదుల నుంచి వస్తున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. కాటన్ బ్యారేజ్ మొత్తం గేట్లను పూర్తిగా ఎత్తి వేసి (ఆల్ క్లియర్ పొజిషన్)ఎగువ నుంచి వస్తున్న నీటిని వస్తున్నట్లే దిగువకు విడుదల చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ నుంచి 7,52,579 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది. ఈ సమయంలో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10 అడుగులుగా నమోదై నిలకడగా కొనసాగుతోంది. ఇదే సమయంలో ఎగువున భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దిశగా పెరుగుతున్న నీటి మట్టం శుక్రవారం రాత్రి 7గంటలకు 42.90 అడుగులకు చేరుంది. మరో పాయింట్ పెరిగి నీటి మట్టం 43 అడుగులకు చేరితే భద్రాచలం వద్ద మొదటిప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది.

తగ్గుతూ..పెరుగుతూ..

చింతూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వరద రోజుల తరబడి పెరుగుతూ, తగ్గుతూ దోబూచులాడుతోంది. చింతూరు వద్ద శబరి నది 32 అడుగులుగా ఉండగా సాయంత్రం 7 గంటలకు 30 అడుగులకు తగ్గింది. కాగా భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి పెరుగుతుండడంతో ఆ ప్రభావం శనివారం ఉదయానికి శబరి నదిపై పడనుంది. దీంతో తిరిగి శబరి పెరిగే పరిస్థితి కానవస్తోంది. గోదావరి ఎగపోటే దీనికి కారణంగా ఉంది. ఇదిలా ఉండగా చింతూరు మీదుగా ఒడిస్సాకు వెళ్లే జాతీయ రహదారిపై వరద నీరు తగ్గడంతో అటుగా రాకపోకలు మొదలయ్యాయి. అయితే సోకిలేరు వాగుపై వరద తగ్గకపోవడంతో చింతూరు- వరరామచంద్రపురం మండలాల నడుమ రాకపోకలు సాగే పరిస్థితి లేకుండా పోయింది. శనివారం శబరి నదికి వరద ఉధృతి పెరిగే పరిస్థితి ఉన్నందున లోతట్టు వాసులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్ సూచించారు. చింతూరు డివిజన్‌లో తొమ్మిది ప్రదేశాల్లో ప్రధాన రహదారులు ముంపునకు గురయ్యాయి. దీంతో అటుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల్లో ప్రజల అవసరాల మేరకు నాటు పడవలు, ట్రాక్టర్లను ఏర్పాటు చేసినట్టు పీవో పేర్కొన్నారు. రోజుల తరబడి వరద తగ్గకపోవడంతో లోతట్టు వాసులు నిత్యావసర వస్తువుల కోసం అవస్థలు పడుతున్నారు. కాగా వరద తగ్గడం, పెరుగుతుండడంతో ముంపు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


చింతూరు-ఒడిస్సా హైవేపై వెళ్తున్న వాహనాలు


నీట మునిగిన చింతూరు-వరరామచంద్రపురం ప్రధాన రహదారి

నిండుకుండలా..



మోతుగూడెం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సీలేరు నది పరివాహక ప్రాంతంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలాశయాల నీటిమట్టాలు గణనీయంగా పెరుగుతున్నాయి. డొంకరాయి జలాశయం 1037 అడుగులు కాగా, శుక్రవారం సాయంత్రానికి 1031.0అడుగులకు చేరుకుంది. వర్షాలు ఇలాగే కురిస్తే త్వరలోనే గరిష్ట నీటి మట్టానికి చేరుకుంటుందని జెన్‌కో ఉన్నతాధికారులు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జలాశయాల నీటిమట్టాలు గణనీయంగా పెరుగుతుండడంతో ముస్ముందు విద్యుదుత్పత్తికి ఎటువంటి ఆటంకాలు ఉండవని అధికారులు పేర్కొన్నారు.

స్కూల్ భవనంపై చర్చి నిర్వహణ సరికాదు

కోరుమిల్లిలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆందోళన


ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్

కపిలేశ్వరపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామంలో ప్రైవేటు పాఠశాల భవనంపై చర్చి నిర్వహిస్తున్నారంటూ హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించి పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ప్రైవేటు పాఠశాల వద్ద ప్రార్థనలు నిర్వహించడం సరికాదని కొంతకాలంగా అడుగుతున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు.రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్,ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, మండపేట రూరల్ సీఐ దొరరాజు ఆందోళనకారులతో చర్చలు జరిపారు. చర్చికి నిర్వహణకు అనుమతులు లేకపోయినా సర్పంచ్, కార్యదర్శి చర్యలు తీసుకోలేదని ఆందోళనకారులు అన్నారు. కాగా చర్చి నిర్వాహకులు వచ్చే నెల 6 నాటికి అనుమతి పత్రాలు సమర్పించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని కార్యదర్శి కామేశ్వరరావు నోటీసు జారీ చేశారు. కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ గవరయ్య, విజయ్, ఉమ్మడి జిల్లా హైందవ పరిరక్షణ మహిళా అధ్యక్షురాలు కె.తులసి, సర్పంచ్ ఆచంట సత్యనారాయణ పాల్గొన్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

కపిలేశ్వరపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక పంచాయతీ శివారు వీధివారి లంకకు చెందిన పల్లి చిట్టియ్య(65) మృతదేహం శుక్రవారం లభ్యమైంది.గురువారం చిట్టియ్య తాతపూడి లంకకు వెళ్లి తిరిగి రాకపోవడంతో గోదావరిలో పడి గల్లంతై ఉండవచ్చని కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందంతో రెవెన్యూ, పోలీసులు గాలించారు.దీం తో చిట్టియ్య మృతదేహాన్ని తొగరపాయ నదిలో గుర్తించి వెలికితీసారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించామని, ఈ మేరకు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ హరీష్‌కుమార్ తెలిపారు.

బంగారు గొలుసు.. బాధితుడికి అందజేత

ఆలమూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పినపళ్ల గ్రామానికి చెందిన కుమ్మరపురుగు ఆదినారాయణ జొన్నాడ నుంచి ఆలమూరు వైపు వస్తుండగా పెట్రోల్ బంక్ సమీపంలో 2కాసుల బంగారు గొలుసు పడిపోయింది. దీనిపై ఆయ న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే అటుగా వస్తున్న ఆలమూరు ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, చింతలూరు సొసైటీ అధ్యక్షుడు నల్లా వెంకన్నలకు ఆ గొలుసు దొరకగా దానిని ఆలమూరు పోలీసులకు అందించారు.దీంతో ఆదినారాయణను పిలిపించి లక్ష్మణరావు, వెంకన్నల సమక్షంలో గొలుసును ఎస్‌ఐ జి.నరేష్, ఏఎస్‌ఐ సూర్యచంద్రరావు అందించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు, వెంకన్నలకు ఆదినారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

బాలబాలాజీ ఆదాయం రూ.38,20,531



మామిడికుదురు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ ఆలయ హుండీల ఆదాయం రూ.38,20,531 వచ్చిందని సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. 71 రోజులకు హుండీ లెక్కింపును శుక్రవారం నిర్వహించగా పై ఆదాయంతో పాటు 30.200 గ్రాముల బంగారం, 105.00 గ్రాముల వెండి, యూఎస్ డాలర్ నాలుగు, సౌదీ అరేబియా రియల్స్ 10, యూఏఈ దిర్హమ్స్ 5, ఒమన్ రియల్స్ 5, కువైట్ దినార్స్ 23, ఇరాక్ దినార్స్ 5 వచ్చినట్టు తెలిపారు. లెక్కింపులో అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన సహాయ కమిషనర్ ఎంకేటీవీ ప్రసాద్, బాలబాలాజీ ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ సమావేశాలకు ఐసీఏఆర్ డైరెక్టర్


శేషుమాధవ్‌ను అభినందిస్తున్న ఐసీఏఆర్, శాస్త్రవేత్తలు, సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్, 29(ఆంధ్రజ్యోతి): పొగాకు, పొగాకు ఉత్పత్తులకు సంబంధించి స్టాక్ హోం స్వీడన్‌లో సెప్టెంబరు 2 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ సమావేశాలకు రాజమహేంద్రవరం ఐసీఏఆర్ డైరెక్టర్ ఎం.శేషుమాధవ్ పాల్గొననున్నారు.భారతదేశం ఐఎస్‌వో-టీసీ-126లో సభ్య దేశంగా ఉన్నందున భారత ప్రతినిధిగా ఆయన ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ సమావేశాల్లో పొగాకు ఉత్పత్తుల పరీక్షలకు సంబంధించి అంతర్జాతీయ ప్రమాణాల సమీక్షలో పాల్గొని ప్రసంగించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శేషుమాధవ్‌కు ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కొట్లాట కేసులో నిందితుడికి ఏడాది జైలు

కె.గంగవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కొట్లాట కేసులో వ్యక్తిని గాయపరిచిన నిందితుడికి జైలు శిక్ష పడిందని పామర్రు ఎస్‌ఐ ఎస్‌కే జానీబాషా శుక్రవారం తెలిపారు. గత సంవత్సరం జూన్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కుడుపూరు గ్రామంలో పోలిశెట్టి వెంకటరమణ తన కుమారుడు మనోహర్‌తో తన ఎదురింటిలో ఉంటున్న కనకాల వీరబాబు వద్దకు వెళ్లి ఒక బండి విషయమై గొడవ పడ్డారు. వెంకటరమణను వీరబాబు దాడిచేసి గాయపరిచాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. రామచంద్రపురం కోర్టులో వాదోపవాదాల అనంతరం వీరబాబుకు ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.శారద శుక్రవారం తీర్పునిచ్చారు. ఏపీపీ రామతులసి వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తులో కృషి చేసిన ఎస్‌ఐ జానీ బాషా, సిబ్బంది బృందాన్ని డీఎస్పీ బి.రఘువీర్, సీఐ వెంకటనారాయణ అభినందించారు.

గేదెలను మేపడానికి వెళ్లి విగతజీవిగా మారాడు

సుద్దగడ్డ కాలువలో వ్యక్తి మృతదేహం

గొల్లప్రోలు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గేదెలు మేపడానికి వెళ్లి కనబడకుండా పోయిన వ్యక్తి విగతజీవిగా మారిన సంఘటన గొల్లప్రోలులో జరిగింది. పట్టణంలోని కరణం గారి వీధికి చెందిన దాట్ల నాగబాబు(48) ఎనిమిదేళ్లుగా వెల్లంకుల నాగశ్రీను వద్ద గేదెలు మేపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 17న గేదెలు మేపేందుకు వెళ్లి తిరిగి రాలేదు. గేదెలు మాత్రం తిరిగి వచ్చాయి. దీనితో అతడి కోసం ఎక్కడా వెతికినా ఫలితం లేకపోయింది. శుక్రవారం ఉదయం పట్టణ శివారు తాటిపర్తి పుంతరోడ్డులోని సుద్దగడ్డ కాలువలో అతడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. కాలువలోని తుమ్మచెట్టుకు తగులుకుని మృతదేహం ఉండిపోయింది. ప్రమాదవశాత్తు పడి మరణించాడా, ఇతర కారణాలు ఉన్నాయా అనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడి భార్య 20 సంవత్సరాల క్రితమే అతడి నుంచి వేరుగా వెళ్లిపోయింది. అతడికి సంబంధీకులు ఎవరు లేరని పోలీసులు తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఎంపీ సానా చొరవతో మోగిన సైరన్

కార్పొరేషన్(కాకినాడ),ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొన్ని నెలలుగా నిలిచిన వాటర్ వర్క్స్ ఆవరణలో ప్రతిరోజు మూడుసార్లు మోగే సైరన్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ చొరవతో మళ్లీ ప్రారంభమైంది. నగర ప్రజలు ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే నగరపాలక సంస్థ కమిషనర్ భావనకి సూచనలు చేశారు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సైరన్ మోగడం ప్రారంభమైంది.

ప్రత్యేక ఆకర్షణగా వెరైటీ గణనాథులు





గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో భారీ గణనాథుడికి పూజలు

పిఠాపురం పట్టణంలోని చిట్టోడితోటలో ఏర్పాటు చేసిన 12 అడుగుల విగ్రహం

(ఆంధ్రజ్యోతి, పిఠాపురం)

పిఠాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నిలిపిన వెరైటీ గణనాథులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విభిన్న రూపాల్లో ఉన్న వినాయకులను భక్తులు దర్శించుకున్నారు.

ఆపరేషన్ సింధూర్ వినాయకుడు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట ఏపీఎస్పీ తిరుమల హాస్పిటల్స్ అధినేత డాక్టర్ గౌరీశేఖర్ ఏర్పాటు చేసిన ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా ప్రధాని మోదీ రూపంతో ఉన్న వినాయక విగ్రహం సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఈవిగ్రహాన్ని తిలకించేందుకు పెద్దఎత్తున సందర్శకులు, విద్యార్థులు తరలివస్తున్నారు. ఈ విగ్రహానికి పూజలు చేయడానికి శనివారం ఉదయం డాక్టర్ ఉమర్ ఆలీషా విచ్చేస్తున్నట్లు గౌరీశేఖర్ తెలిపారు.

జనసేన నాయకుడు రూ.3లక్షల విరాళం

కొత్తపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన మత్స్యకార నాయకుడు, జనసేన నాయకుడు ఉమ్మిడి చిన్న వినాయక చవితి మండపాలకు రూ.3లక్షల విరాళాన్ని శుక్రవారం అందజేశారు. ఈ మొత్తాన్ని పిఠాపురం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు గ్రామంలోని 15 వినాయక ఉత్సవ కమిటీలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన చిన్నను అభినందించారు. అనంతరం గ్రామంలో వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన వైద్యవిభాగం ప్రతినిధి, సురక్ష మల్టీస్పెషాల్టీ హాస్టల్ అధినేత డాక్టర్ జ్యోతుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



కోనపాపపేటలో వినాయకునికి పూజలు చేస్తున్న జనసేన నాయకులు చిన్న

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



పిఠాపురం డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న కామేశ్వరశర్మ



తిమ్మాపురం అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఎస్.మల్లిబాబు

కాకినాడ రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీకళాశాల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించినట్లు తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ హరిరామప్రసాద్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు పాల్గొని గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆర్డీవో మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి వాడుక భాషకు ఎనలేని సేవలుచేశారన్నారు. డాక్టర్ సీహెచ్ కూర్మయ, గౌరీనాయుడు, వెంకటేశ్వరరావు, జాన్‌సామ్యూల్, ఆశీర్వాదం, అరుణ, వెన్నెల పాల్గొన్నారు.

పిఠాపురంలో తెలుగు భాషా దినోత్సవం

పిఠాపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రాచీన భాషల్లో తెలుగుకు విశిష్టస్థానం ఉందని, ఏ భాషకు చెందిన పదాన్ని అయినా తనలో కలుపుకుని నూతనత్వాన్ని సంతరించుకునేలా చేస్తుందని తెలుగు పండితుడు వారణాసి కామేశ్వరశర్మ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.సుభాషిణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ, తెలుగు అధ్యాపకురాలు కె.మాధవి పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి పంతులు, తెలుగు తల్లి, ఆదికవి నన్నయ్య, తిక్కన్న, ఎర్రన్న, శ్రీకృష్ణదేవరాయులతోపాటు సంప్రదాయాలు ఉట్టిపడే వేషధారణలో విద్యార్థులు అలరించారు. పిఠాపురంలోని భాష్యం స్కూలులో శుక్రవారం తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. భాష్యం ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, ప్రైమరీ హెచ్ఎం అరుణ పాల్గొన్నారు.

గొల్లప్రోలులో..

గొల్లప్రోలు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలల్లో గిడుగు రామ్మూర్తి పంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని మాధురి విద్యాలయలో జరిగిన కార్యక్రమంలో గిడుగు రామ్మూర్తి పంతులు, తెలుగు తల్లి వేషధారణలో విద్యార్థులు అలరించారు. విద్యాసంస్థల చైర్మన్ తమ్మయ్యనాయుడు, సెక్రటరీ సీతాదేవి పాల్గొన్నారు.

అక్నూఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో...

సర్పవరం జంక్షన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తిమ్మాపురం అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ ఆధ్వర్యంలో శుక్రవారం గిడుగు రామ్మూర్తి జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సామర్లకోటలో..

సామర్లకోట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సామర్లకోట యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పద్య పఠనం, వ్యాసరచన, వక్తృత్వం అంశాల్లో పోటీలను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శ్రీదేవి ఆధ్వర్యంలో తెలుగు భాషా పండితురాలు బి.శ్రీలక్ష్మి పర్యవేక్షణలో విజేతలకు బహుమతులను హెచ్ఎం శ్రీదేవి అందజేశారు. క్రీడాదినోత్సం సందర్భంగా హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ గొప్పతనాన్ని ఉపాధ్యాయులు వివరించారు. ఉపాధ్యాయులు వి.నూకాలమ్మదేవి, బి.జయశేషసాయి పాల్గొన్నారు. అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో తెలుగు భాషాదినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవాలు నిర్వహించారు. ఎంఈవో శివరామకృష్ణయ్య ప్రసంగించారు.

నేడు పిఠాపురం కౌన్సిల్ సమావేశం

పిఠాపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11గంటలకు పురపాలక సంఘ కార్యాలయం కౌన్సిల్‌హాలులో జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ నామ కనకారావు తెలిపారు. మునిసిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాతోపాటు సభ్యులు ప్రస్తావించే అంశాలపై చర్చ జరుగుతుందని చెప్పారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

నూరుశాతం అక్షరాస్యత సాధనకు కృషి

అక్షర ఆంధ్ర డీడీ పోసయ్య

గొల్లప్రోలురూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అందరికీ అక్షర జ్ఞానం కల్పించి నూరుశాతం అక్షరాస్యత సాధించేందుకు కృషి చేద్దామని ఉల్లాస్ అక్షర ఆంధ్ర డిప్యూటీ డైరెక్టర్ పోసయ్య సూచించారు. అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిక చేసిన 358మంది వలంటీర్లకు శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. వయోజనులందరి అక్షరజ్ఞానంవల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీడీవో కర్రి స్వప్న, అక్షర ఆంధ్ర ప్రతినిధి ఆనంద్ పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మతల్లి జాతర ప్రారంభం

తాళ్లరేవు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పెదబొడ్డువెంకటాయపాలెంలోని శ్రీమహాలక్ష్మమ్మతల్లి అమ్మవారు ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారిని ప్రజలు గ్రామపురవీదుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లి బాణసంచా, డప్పులతో గోదావరి స్నానం చేయించారు. వారంరోజులపాటు అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయని గ్రామపెద్దలు తెలిపారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

గొల్లప్రోలు రూరల్/పిఠాపురం రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పిఠాపురం సీఐ శ్రీనివాస్ కోరారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు, పిఠాపురం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించి వినాయక మండపాలు, పందిర్లను సందర్శించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్దలు, గ్రామస్తులతో మాట్లాడారు. కార్యక్రమంలో గొల్లప్రోలు, పిఠాపురం రూరల్ ఎస్ఐలు ఎన్.రామకృష్ణ, జానీభాషా పాల్గొన్నారు.

31న భువనేశ్వరి మాత జయంతి

పెద్దాపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వర్షులవారీ వీధిలోఉన్న భువనేశ్వరి పీఠంలో ఈనెల 31న అమ్మవారి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు పీఠాధిపతి చింత గోపిశర్మ తెలిపారు. జయంతి వేడుకల్లో భాగంగా పలు పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

మర్చిపోయిన బ్యాగ్ అందజేత

సామర్లకోట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తూ విలువైన పత్రాలు, సర్టిఫికెట్లు, నగదు ఉన్న బ్యాగ్‌ను మర్చిపోయిన ఒక కుటుంబానికి సామర్లకోట ట్రాఫిక్ పోలీసులు తిరిగి అందజేశారు. ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు తెలిపిన సమాచారం ప్రకారం.. రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరుకు చెందిన ఓ యువతి సామర్లకోట మండలం ఉండూరులో ఆటో ఎక్కి సామర్లకోటకు చేరుకుంది. ఆటోలో బ్యాగ్ మరిచిపోయిన విషయాన్ని గుర్తించి ట్రాఫిక్ ఎస్ఐ గరగారావుకు విషయాన్ని చెప్పారు. ఆయన స్పందించి సీసీ కెమెరాల ద్వారా ఆటోను గుర్తించి డ్రైవర్‌కు ఫోన్ చేసి రప్పించారు. ట్రాఫిక్ ఎస్ఐకు యువతి కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

సామర్లకోట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారదిశగా సామర్లకోట ఏడీబీ రోడ్డు కొప్పవరంలోని రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు కార్యాలయంలో ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తూ పలు సమస్యలను పరిష్కరిస్తున్నామని ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి తెలిపారు. 19వ ప్రజాదర్బార్‌లో ఈ మేరకు 30 అర్జీలను వివిధ ప్రాంతాలకు చెందిన వారినుంచి స్వీకరించినట్లు లక్ష్మణమూర్తి తెలిపారు. వాటిలో 5అర్జీలు ఆయాశాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించామన్నారు. చప్పిడి వెంకటేశ్వరరావు, నులకుర్తి వెంకటేశ్వరరావు, ఆనంద్‌న్యూటన్, చింతపల్లి అర్జున్, జున్నూరు బాబ్జీ, అనిల్, నరహరశెట్టి సూరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక కుంకుమ పూజ



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

కాకినాడ సిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నగరంలోని దుగ్గిరాల వారి వీధిలో మూడోరోజు శుక్రవారం సాయంత్రం చిల్లా రమణారెడ్డి, మాధవి దంపతుల ఆధ్వర్యంలో 216మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బెజవాడ బాబీ, నల్లూరి శ్రీనివాస్, నల్లమిల్లి వెంకటరెడ్డి, మండవిల్లి వెంకన్నబాబు, మిడిమళ్ల కుమార్, కర్రిప్రసాద్, చీకట్ల వాసు, ఆకెళ్ల ప్రసాద్, ఉప్పులూరి వీరభద్రరావు, నున్న ఈశ్వరరావు, బల్ల కొండబాబు పాల్గొన్నారు.

నేత్రదాన పక్షోత్సవాల ప్రచార సామాగ్రి విడుదల

కాకినాడ రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రచరించిన ప్రచార సామాగ్రి విడుదల నేత్రదాన అవగాహన బోర్డులు, పోస్టర్లను శుక్రవారం ఐ బ్యాంక్ కార్యదర్శి డాక్టర్ బాదం బాలకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోశాధికారి దాసరి సాయికృష్ణ, కె.మురళీకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

'నిస్వార్థ సేవకుడు ఆంజనేయరెడ్డి'



ఆంజనేయరెడ్డిని సత్కరిస్తున్న బండారు దత్తాత్రేయ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రెండున్నర దశాబ్దాలకు పైగా నిరంతరం ప్రయాణికుల దాహార్తిని తీరుస్తూ, నిరుపేదల సేవలో తరిస్తున్న సామాజిక సేవకుడు రమణయ్యపేటకు చెందిన అనపాల ఆంజనేయరెడ్డికి తెలుగు కీర్తి పురస్కారాన్ని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అందజేశారు. గురువారం రాత్రి హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంలో పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు అద్దంకి రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని కాకినాడ రూరల్ రమణయ్యపేటకు చెందిన సామాజిక సేవకుడు అనపాల ఆంజనేయ రెడ్డికి తెలుగు కీర్తి పురస్కారంతోపాటు ప్రశంసాపత్రం అందించి సత్కరించారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

కార్యకర్తలు, నాయకులకు ఎమ్మెల్యే చినరాజప్ప పిలుపు

సామర్లకోట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : పెద్దాపురం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రజాసమస్యలు ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషిచేయాలని పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. ప్రతి శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ సెల్ శుక్రవారం పార్టీ అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ గత శనివారం పెద్దాపురం, సామర్లకోటల్లో సీఎం చంద్రబాబు పర్యటన విజయవంతమైందన్నారు. ప్రతి ఇంటా సోలార్ విద్యుదుత్పత్తి పథకంపై మోటివేటర్ పి.రవిచంద్ర అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్ (బాబు), బలుసు శ్రీనివాసు, జయలక్ష్మి, ఎలిశెట్టి నాని,జార్జీ చక్రవర్తి పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

పెద్దాపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం (టైలరింగ్) ముగింపు కార్యక్రమంలో ఆయన శుక్రవారం మాట్లాడారు. కూటమి ప్రభుత్వతోనే మహిళ అభివృద్ధి సాధ్యమన్నారు.కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ సూరిబాబు రాజు, కమిషనర్ కే.శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

అమ్మ భగవాన్ శిష్యురాలు సౌజన్య దాసాజీ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికితీసేందుకు ఆధ్యాత్మిక శిక్షణ ఎంతగానో దోహదం చేస్తుందని అమ్మ భగవాన్ శిష్యురాలు సౌజన్య దాసాజీ అన్నారు.ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో కాపు కల్యాణ మండపంలో శ్రీపరం జ్యోతి స్త్రీ శక్తివరం ఆధ్యాత్మిక శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమన్నారు. మహిళలు శక్తివంతులుగా తయారయ్యేందుకు శ్రీపరమ జ్యోతి స్త్రీశక్తివరం కార్యక్రమం ఉపయోగపడుతుందని ఆలయ కమిటీ సభ్యులు ఎన్.శ్రీనివాస్ ప్రసాద్, దేశంశెట్టి భువనేశ్వరి తెలిపారు.ఈ కార్యక్రమంలో ముత్యాల నాగేశ్వరరావు,వెంగళరావు, పి.చిరంజీవి పాల్గొన్నారు.

నూతన ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందజేస్తాం

సెంట్రల్ బ్యాంక్ డీజీఎం శ్యామలాదేవి

పిఠాపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు వారి నూతన ప్రాజెక్టులకు కావాల్సిన ఆర్థిక సహకారాన్ని అందజేస్తామని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేట్ క్రెడిట్ ఆఫీసు డిప్యూటీ జనరల్ మేనేజర్ వై.శ్యామలాదేవి తెలిపారు. పిఠాపురం కాకినాడ రోడ్డులోని ఎస్.కన్వెన్షన్‌హాలులో శుక్రవారం నిర్వహించిన బ్యాంకు కస్టమర్స్ మీట్, వ్యాపార, పారిశ్రామికవేత్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఖాతాదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తామన్నారు. దేశవ్యాప్తంగా తమ బ్యాంకుకు 4,552 బ్రాంచ్‌లు ఉండగా 65 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయని తెలిపారు. రూ.4.28లక్షల కోట్లు డిపాజిట్లు ఉండగా, 2.76లక్షల కోట్లను రుణాలుగా ఇచ్చినట్టు చెప్పారు. బ్యాంకు లావాదేవీల ద్వారా రూ.1100 కోట్లు లాభాలు ఆర్జించినట్లు తెలిపారు. రీజనల్ మేనేజరు ఏవీ రమణమూర్తి మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పథకం ద్వారా చిన్నతరహా వ్యాపారాలు, యూనిట్లకు రుణాలు అందజేస్తున్నామన్నారు. తమ రీజియన్ పరిధిలో 40 బ్రాంచ్‌లు ఉండగా, మరో రెండు ప్రారంభించనున్నట్టు తెలిపారు. సమావేశంలో పిఠాపురం బ్రాంచి మేనేజరు సాయిసుధా, సిబ్బంది సునందిని, గాయత్రి, బాబా, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న వేణుగోపాలస్వామి నూతన ధర్మకర్తల మండలి సభ్యులు

సామర్లకోట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సామర్లకోట వేణుగోపాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో నూతన ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో తనిఖీదారులు వడ్డి ఫణికుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా తుమ్మల గౌరిప్రసాద్, సభ్యులుగా దేశెట్టి సూర్యవేణిపార్వతి, వద్దిపర్తి అనంత శివరామకృష్ణ, కాళ్ళ పార్వతి, సిద్దా సూర్యనారాయణ, మసకపల్లి లకువుడు, సుకపట్ల గీత, తాతపూడి వేణుగోపాలకృష్ణ, గోపాలదాసు రవి, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఆలయ అర్చక స్వామి ఖండవిల్లి అనంత శ్రీకృష్ణ సుధీర్‌లు ప్రమాణస్వీకారం చేశారు. నూతన కార్యవర్గ సభ్యుల్ని అధికారులు అభినందించారు.

జేఎన్‌టీయూకేలో జాతీయ క్రీడా దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్

జేఎన్టీయూకే, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): యూజీసీ సూచనల మేరకు ఈఏడాది జాతీయ క్రీడాదినోత్సవంలో భాగంగా వర్సిటీ, యూసీఈకే ల్లో మూడురోలపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్లు వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ తెలిపారు. ఈనెల 31 వరకూ జరిగే కార్యక్రమాల ను శుక్రవారం ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏక్‌ఘంటా కేలీకే మైదాన్ మీన్‌లో భాగంగా విద్యార్థులకు ఏరోబిక్స్, జుంబా డ్యాన్స్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మోహన్‌రావు, పీడీలు ఎం.వెంకటేశ్వరరావు, సీహెచ్ సుధాదేవి, రాజా, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

'శ్రీ ప్రకాష్'లో ఘనంగా క్రీడా దినోత్సవం



ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సూరిబాబురాజు

పెద్దాపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో, ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా మున్సిపాల్టీ మాజీ చైర్మన్ సూరిబాబురాజు హాజరై మాట్లాడారు. క్రీడలవల్ల శారీరక దారుఢ్యమే కాకుండా, మానసిక దారుఢ్యం పెరుగుతుందని, అందువల్ల అందరూ క్రమం తప్పకుండా ఆడుతూ ఉండాలని అన్నారు. శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాల డైరెక్టర్ విజయప్రకాష్ మాట్లాడుతూ ప్రతివిద్యార్థి ఏదొక క్రీడను ఎంచుకుని క్రమం తప్పకుండా ఆడుతూ ఉండాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటాయని అన్నారు.

విద్యుత్ ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

సామర్లకోట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో గ్రేడ్-2 జేఎల్ఎంలుగా పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలు సత్వరం పరిష్కరించి తమ ప్రాణాలకు భద్రత కల్పించాలని కోరుతూ సామర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పెద్దాపురం, పిఠాపురం నియోజకవర్గాల్లో పనిచేస్తున్న 100మంది సిబ్బంది సామర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఉద్యోగ సంఘ ప్రతినిధులు మణికంఠ, రామాంజనేయులు, ఏసురాజు, గోవిందులు, విద్యుత్ ఈఈ ఏపీఎస్పీఎస్ ప్రభాకర్‌కు సమస్యలపై ఏకరువుపెట్టారు. తాము సచివాలయాల్లో పనిచేసే ఎనర్జీ అసిస్టెంట్లుగా నియమకమైనా విద్యుత్‌శాఖలోని అన్ని పనులకూ తమనే వినియోగిస్తున్నారన్నారు. ఇటీవల విద్యుదాఘాత ప్రమాదాల కారణంగా పలువురు ఎనర్జీ అసిస్టెంట్లు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. జాబ్‌చార్ట్ పెరగడంతో ఒత్తిడి తీవ్రతరంగా ఉండి ప్రమాదాలకు గురవుతున్నామన్నారు. విధినిర్వహణలో మృతిచెందిన ఎనర్జీ అసిస్టెంట్ కుటుంబానికి నష్టపరిహారం అధికారుల నుంచి వసూలుచేసి అప్పగించాలని ఈఈ ప్రభాకర్‌కు పలు మండలాల ఈఏలు వినతిపత్రం అందించారు.

జగన్ పర్యటనకు నగర పంచాయతీ నిధులా

గొల్లప్రోలు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సీఎం హోదాలో జగన్ మూడేళ్ల క్రితం జరిపిన గొల్లప్రోలు పర్యటనకు సంబంధించిన ఖర్చులకు ఇప్పుడు నగర పంచాయతీ నిధులు కేటాయించడంపై టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈమేరకు వారు శుక్రవారం గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయానికి వచ్చి తమ అభ్యంతరాన్ని తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు. కాపు నేస్తం నిధుల విడుదలకు జగన్ గొల్లప్రోలు వచ్చి ఇచ్చిన హామీని నెరవేర్చకపోగా గొల్లప్రోలు, పిఠాపురం మునిసిపాలిటీలకు కేటాయిస్తామన్న రూ.20కోట్ల నిధుల్లో ఒక్క పైసా విదల్చలేదని వివరించారు. ఆ పర్యటన సమయంలో వివిధ ఖర్చులకోసం రూ.15లక్షలు బిల్లులు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండ్ర సుబ్బారావు, బస్సా సత్యనారాయణ పాల్గొన్నారు.

పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ



పిఠాపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ సూచించారు. పిఠాపురం అగ్రహారంలోని శ్రీపాద అనఘా దత్త క్షేత్రంలో ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామిజీ చేపట్టిన చాతుర్మాస్య వ్రత దీక్షా మహోత్సవం కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన అనఘాదత్త స్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన పురోహిత సభలో పాల్గొన్నారు. భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మంచి పుస్తకాలు, సాహిత్యం లభించేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. సినిమాల్లో వేటూరి, సిరివెన్నెల సీతారామశాస్త్రి రాసిన పాటలు, అందులో సాహిత్యం, సుశీల, జిక్కీ తదితర గాయకులు పాడిన భక్తిపూర్వక పాటల గురించి ఉదహరించారు. కొన్ని పాటలు ఎన్ని యుగాలు గడిచినా చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో దత్త విజయానంద తీర్థస్వామిజీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

తునిరూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): క్రీడలు ఆరోగ్యాన్ని ఇస్తాయని తుని పట్టణ ఎస్ఐ విజయ్ బాబు అన్నారు. తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా తుని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి తుని పట్టణ ఎస్ఐ విజయబాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎంవీఎస్ మూర్తి ప్రధానోపాధ్యాయురాలు బి.సీతారాణి అధ్యాపక బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గిడుగుకు నివాళి

తొండంగి, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): తెలుగుభాషాదినోత్సవాన్ని నిర్వహించారు. పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మెహర్ ఆధ్వర్యంలో గిడుగు చిత్రపటానికి నివాళులర్పించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మోతుగూడెం, తులసిపాక పీహెచ్‌సీల తనిఖీ


మోతుగూడెం పీహెచ్‌సీలో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

మోతుగూడెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):మోతుగూడెం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో డీఎంహెచ్‌వో విశ్వేశ్వర నాయుడు తనిఖీలు చేశారు. ముందుగా మలేరియా టైఫాయిడ్ కేసులు ఎలా ఉన్నాయని ల్యాబ్ టెక్నీషియన్‌ను అడిగి తెలుసుకున్నారు. తర్వాత రికార్డులు పరిశీలించారు. మందులు ఇచ్చే విభాగాన్ని కూడా పరిశీలించారు. డీఎంహెచ్‌వో స్వయంగా ఆసుపత్రిలోని పేషెంట్లతో మాట్లాడారు. అన్నీ బాగానే ఉన్నాయి, ఆసుపత్రిలో వర్షపు నీరు కారిపోతుంది. కొత్త ఆసుపత్రి నిర్మించండి అని రోగులు అడుగ్గా డీఎంహెచ్‌వో స్పందిస్తూ కలెక్టర్‌తో ఈ విషయం మాట్లాడతాను, త్వరలో ఈ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తర్వాత సెప్టెంబర్ 30తేదీలోపు మోతుగూడెంలోనే డెలివరీ ఆపరేషన్ నిర్వహిస్తామని తెలియజేశారు అనంతరం తులసిపాక పీహెచ్‌సీ సందర్శించారు. సిబ్బంది, రోగులతో పరస్పర చర్చలు జరిపి, అక్కడ అందిస్తున్న ఆరోగ్య సేవలపై సమీక్ష నిర్వహించారు. తులసిపాక పీహెచ్‌సీ వైద్యుడు నాయుడు ప్రశంసిస్తూ, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, రోగులకు మంచి వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బంది కృషి, అంకిత భావాన్ని అభినందించారు. ఆయన వెంట మోతుగూడెం వైద్యురాలు నఫియా, అడిషనల్ డీఎంహెచ్‌వో పుల్లయ్య, తులసిపాక సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు నాణ్యతతో పూర్తిచేయాలి'


పనులను పరిశీలిస్తున్న పీవో

రంపచోడవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల ప్రహరి గోడ, డ్రైనేజీ పనులు నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం అన్నారు. శుక్రవారం ఆయన జరుగుతున్న ప్రహరి గోడ, డ్రైనేజీ పనులను పరిశీలించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాలన్నారు. అనంతరం యూనియన్ బ్యాంక్ సమీపంలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా మార్టును పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయురాలు పద్మావతి పాల్గొన్నారు.

ఆర్థిక, సామాజిక రాజకీయ సాధికారతే లక్ష్యం


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన సమాజానికి ఆర్థిక, సామాజిక రాజకీయ సాధికారత కల్పించడమే ఎస్టీ కమిటీ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర గిరిజన సంక్షేమ కమిటీ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. శుక్రవారం ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగిన జాతీయస్థాయి ఎస్టీ సంక్షేమ సమావేశానికి ఆమె పాల్గొని మాట్లాడారు. గిరిజన సంక్షేమ పథకాల పర్యవేక్షణ, శాఖల నివేదికల సమీక్ష, ఫీల్డ్ విజిట్స్, భూమిహక్కుల పరిరక్షణ, విద్య, ఆరోగ్య సదుపాయాల బలోపేతం, ఉపాధి అవకాశాల పెంపు, డిజిటల్ చేరువ వంటి కార్యక్రమాలు కమిటీ విజయవంతంగా అమలుచేస్తోందని అన్నారు.

ఒకే నది రెండు రంగులు


ఎడమవైపు నలుపు రంగులోను కుడివైపు ఎరుపు రంగులోను ప్రవహిస్తున్న శబరి నది

కూనవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):ఒరిస్సా రాష్ట్రంలో జన్మించిన శబరినది ఛత్తీస్‌గఢ్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని కూనవరం వద్ద గోదావరి నదిలో కలుస్తోంది. గోదావరి ఉపనది అయిన శబరి ఉప్పొంగినప్పుడు మాత్రం రెండు పాయలుగా వేర్వేరు రంగులలో కూనవరం దగ్గర శబరినది ప్రవహిస్తోంది. ఒక పాయ నలుపు రంగులోను మరో పాయ ఎరుపు రంగులోను ప్రవహిస్తూ ఈ రెండు కలిసి గోదావరిలో కలుస్తాయి. శబరి నది ప్రశాంతంగా ఉన్నప్పుడు మాత్రం ఒకే రంగులో ఉంటుంది. శబరి గోదావరి సంగమం వద్ద కూడా గోదావరి ఒక రంగులోనూ శబరి మరో రంగులోను ప్రవహిస్తాయి. ఇవి మాత్రం నిత్యం ఇలాగే ప్రవహిస్తాయి.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

చింతూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. శుక్రవారం చింతూరు సచివాలయం ముందు గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనంగా రూ. 21వేలు చెల్లించాలి, 551 జీఓ మేరకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, ప్రమాద బీమా రూ. 10లక్షలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. చివరిగా కార్మికులు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యదర్శి గంగరాజుకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సీసం సురేష్, మొట్టుం రాజయ్య, కారం నగేష్, గ్రామ పంచాయితీ కార్మికులు రాజమ్మ, రాములమ్మ, శారద, వెంకమ్మ, దుర్గ, మూర్తి, నాగరాజు, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందించాలి

చింతూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రోజుల తరబడి వరద రావడం, తగ్గడంతో లోతట్టువాసులు అవస్థలు పడుతున్నారని ఆదివాసీ గిరిజన సంఘం నాయుకుడు పొడియం జాని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వరద ప్రభావిత కుయుగూరు, కల్లేరు గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వరద బాధితులకు ప్రభుత్వం నిత్యావసర వస్తువులు అందించాలని డిమాండ్ చేశారు. రాకపోకలు నిలిచిపోవడంతో ముంపు బాధితులు నిత్యావసర వస్తువుల కొనుగోలు కోసం చింతూరు మార్కెట్‌కు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గిడుగు వెంకట రామమూర్తి జయంతి

రంపచోడవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతిని కళాశాల ప్రధానోపాధ్యాయుడు కలింకోట కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేశారు. గిడుగు తెలుగు భాష కోసం చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరసిద్ధి వినాయకుడి ఆలయంలో మహిళల కుంకుమ పూజలు

ఎటపాక,ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం మూడోరోజు కొనసాగాయి. ఈక్రమంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గన్నవరం గ్రామంలోని శ్రీవరసిద్ధి వినాయక ఆలయంలో మహిళలు కుంకుమ పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చుట్టు ప్రక్కల గ్రామాల్లోని మహిళలంతా కుంకుమ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు చీరాల వీరయ్య, యాలం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ
- అన్నవరంలో 'సూపర్‌సిక్స్ సూపర్ హిట్'
- ప్రత్తిపాడు నుంచి భారీ ర్యాలీగా


ప్రత్తిపాడు: బస్సు వద్ద విక్టరీ సింబల్ చూపుతున్న ఎమ్మెల్యే



అన్నవరం సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

అన్నవరం, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని స్థానిక శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం అన్నవరం వన్ రిసార్ట్స్‌లో సూపర్‌సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గం నలుమాలల నుంచి మహిళలు సమావేశానికి విచ్చేసారు. సభాప్రాంగణానికి ఆర్టీసీ బస్సులో మహిళలతో కలసి ఆమె ప్రయాణించి సభాప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ప్రధాని మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటికే తమ ప్రభుత్వం మహిళలకు తల్లికివందనం, మూడు ఉచిత గ్యాస్‌సిలిండర్లు, ఉచిత ఆర్టీసీ ప్రయాణం పథకాలను అమలుచేసిందన్నారు. టీడీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు సుంకర పావని మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వం కాచ్యాచరణ రూపొందించి సగర్వంగా తిరిగేలా వ్యవహరిస్తుందన్నారు.పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధి నినాదంతో పాలన సాగిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో పరిశ్రమలు పెట్టడానికి భయపడేవారని, ప్రస్తుతం రాష్ట్రానికి పరిశ్రమలు వెల్లువలా వస్తున్నాయన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు మెట్ల రమణబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో సత్యప్రభ నాయకత్వంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. చంద్రబాబు కృషి, కేంద్ర సహకారంతో పలు ప్రాజెక్టులు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. సమావేశానికి సుమారు మూడువేలమంది మహిళలు హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు యాళ్ల జగదీష్, పర్వత సురేష్, బద్ది రామారావు, ఉల్లి వీరభద్రరావు, స్థానిక నాయకులు మెరపల నరసయ్య, బొమ్మిడి సత్తిబాబు, రాజాల చిట్టిబాబు, బండారు సురేష్, వీర్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రకు విశేష స్పందన

ప్రత్తిపాడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తోన్న స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకానికి అనూహ్యస్పందన లభిస్తోంది. శుక్రవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నుంచి అన్నవరం వరకు విజయోత్సవ బస్సు యాత్ర నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలతో విజయోత్సవ ర్యాలీ అన్నవరం వరకు కొనసాగింది. ఎమ్మెల్యే పిలుపుతో ప్రత్తిపాడు, శంఖవరం, ఏలేశ్వరం రౌతులపూడిమండలాల నుంచి విజయోత్సవ ర్యాలీలో ఆటోలు, ఇతర వాహనాల్లో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయం రహదారి జంక్షన్ వద్ద బస్సు యాత్రను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకానికి అద్భుత స్పందన వస్తుందన్నారు. మహిళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో పాటు ప్రధాని మోదీ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నార న్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు మెట్ల రమణబాబు, టీడీపీ సీనియర్ నాయకులు కొమ్ముల కన్నబాబు, వెన్నా శివ, పైలా సాంబశివరావు, ఇతంశెట్టి భాస్కరరావు, పర్వత సురేష్, గంటుమళ్ళ రాజ్యలక్ష్మి, బొదిరెడ్డి గోపి, మూది నారాయణ స్వామి, బద్ది రామారావు, ఉల్లి వీరభద్రరావు, యర్రాబత్తుల గోవిందనాయుడు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టులో ప్రజాప్రయోజన పిటిషన్

జగ్గంపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఐదు అంశాలకు సంబంధించి హైకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు చేసినట్టు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మరోతి శివగణేష్ తెలిపారు. ఏలేరు జలాశయం వరదల కారణంగా మూడు సంవత్సరాల నుంచి నష్టపోయిన 67వేల ఎకరాల రైతులకు రూ.1.50లక్షలు చొప్పున రూ.5కోట్లు నష్టపరిహారం ఇవ్వాలని, 11మండలాల్లోని రెండు లక్షల కుటుంబాలకు రూ.50వేలు చొప్పున రూ.1000 కోట్లు నష్టపరిహారం ఇవ్వాలని, ఏలేరు కాల్వలను పటిష్ట పరచడానికి, ఆధునికీకరణకు రూ.1000కోట్లు ప్రభుత్వం మంజూరు చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. జగ్గంపేట, రామవరం, గోనాడ, కాట్రావులపల్లి, సీతానగరం మధ్యలో సారవంతమైన నేలలను, ఏలేరు నది నీటి తీరువాలో కొన్ని వేల ఎకరాల పంట పొలాలను కలుషితం చేసే, లక్షల మంది ఆరోగ్యాలను హరించే, లక్షల మంది వ్యవసాయ కార్మికుల జీవనోపాధిని నిర్వీర్యం చేసే జగ్గంపేటలో నిర్మాణం చేసిన దేవి ఫిషరీస్ లిమిటెడ్, దేవి ఆక్వాటిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలను మూయించి వేయాలని, అక్రమ పర్మిషన్లు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకుని ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. బాంబ్ బ్లాస్టింగ్ చేస్తూ చుట్టుపక్కల గ్రామాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ మైనింగ్ చేస్తున్న గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామ పంచాయతీ పరిధిలో జట్టి గ్రానైట్స్ ఆపరేషన్స్ సస్పెండ్ చేసి, క్రషర్ షట్‌డౌన్ చేయాలని, అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకుని, బాధితులకు నష్టపరిహారం ఇప్పించాలని కోరారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

కిర్లంపూడి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బూరుగుపూడి ప్రభుత్వ ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అందించే మెనూను శుక్రవారం స్కూల్ చైర్మన్ గొల్లపూడి శ్రీనివాస్ పరిశీలించారు. నాణ్యతతో మెనూను విద్యార్థులకు అందించాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఆదినారాయణమూర్తి మాట్లాడుతూ వారంలో ఐదు రోజులు కోడి గుడ్డుతో భోజనం పెడుతున్నామన్నారు. విద్యార్థులకు సన్న బియ్యంతో అన్నం వండడంతో కడుపు నిండా తింటున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్యను అభ్యసించి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాక్షించారు.

అర్హులందరికీ పెన్షన్లు

జగ్గంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగులు ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హామీ ఇచ్చారని టీడీపీ విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు మండపాక అప్పన్న దొర అన్నారు. స్థానిక రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో చాలా మంది అనర్హులకు పింఛన్లు ఇచ్చారన్నారు. దీనివల్ల అర్హులకు నష్టం కలుగుతోందన్నారు. ఏ ఒక్క అర్హుడికీ నష్టం జరుగకూడదంటే అనర్హులను తప్పించాల్సి ఉందన్నారు. తాత్కాలిక సర్టిఫికెట్లు ఉన్న వారికి నోటీసులతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరికీ పింఛను ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని దొర తెలిపారు. శనివారం ఉదయం జగ్గంపేట రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు ట్రైసైకిల్ పంపిణీ చేస్తామన్నారు. అర్హులైన దివ్యాంగులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకురావాలన్నారు.

టీడీపీలో చేరికలు

తునిరూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): టి.తిమ్మాపురం టీడీపీ సీనియర్ నాయకులు కాపారపు అబ్బులు, పోలనాటి కృష్ణ, అత్తి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన వైసీపీ ముస్లిం నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఘనంగా తెలుగు భాషా వేడుకలు

జగ్గంపేట, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట రావులమ్మనగర్‌లోని భాష్యం పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు రామమూర్తి పంతులు, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. తెలుగు భాషా గురించి ప్రిన్సిపాల్ కుసిరెడ్డి సత్యనారాయణ వివరించారు. విద్యార్థులకు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ జోనల్ ఇన్‌చార్జ్ గోవిందరాజు శుభాకాంక్షలు తెలియజేశారు.

తడి, పొడి చెత్త వేరుచేసి సంపద సృష్టించండి

- డిప్యూటీ సీఈవో రామగోపాల్

గండేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తడి, పోడి చెత్త వేరుచేసి సంపద సృష్టించాలంటూ పంచాయతీరాజ్ శాఖ జిల్లా డిప్యూటీ సీఈవో రామగోపాల్ అన్నారు. ఆయన శుక్రవారం మండల కేంద్రమైన గండేపల్లిలో పర్యటించారు. ముందుగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ వాహనాలు వారానికి ఎన్ని రోజులు వస్తున్నాయని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులు ప్రతిఒక్కరు తడి, పొడి చెత్త వేరుచేసి పంచాయతీ వాహనాల్లో వేయాలన్నారు. అనంతరం గండేపల్లిలో ఉన్న సంపద కేంద్రాన్ని పరిశీలించారు. సంపద కేంద్రాల్లో ఎరువు తయారీ విధానంపై అధికారులను అడిగారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.చంద్రరావు, కార్యదర్శులు పణింద్ర కుమార్, పి.వెంకటరమణ పాల్గొన్నారు.


సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ శాఖ జిల్లా డిప్యూటీ సీఈవో

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



కత్తిపూడిలో మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

శంఖవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కత్తిపూడి మాధురి పాఠశాలలో గిడుగు రామమూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. విద్యార్థులు గిడుగు రామమూర్తి, తెలుగుతల్లీ వేషధారణలతో అలరించారు. భాషా ఉద్యమానికి ఆద్యుడైన గిడుగు రామమూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించుకోవడం ఆనందదాయకమని తెలిపారు. క్రీడా దినోత్సవం ప్రాముఖ్యతను ప్రతీ విద్యార్థి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కడారి తమ్మయ్యనాయుడు, ఆదినారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు, ధర్మవరం గ్రామాల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక మినర్వా, ధర్మవరం ప్రతిభ విద్యాలయంలో భాషా వేత్త గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుభాష ప్రాముఖ్యతను వివరించిన చిన్నారులను మినర్వాలో ఉపాధ్యాయులు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మట్టపర్తి లక్ష్మణకుమార్, గఫూర్, నాగేశ్వరరావు, విజయలక్ష్మి, షాలిని, ధర్మవరంప్రతిభలో కరస్పాండెంట్ దాసం శేషారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో ఘనంగా బలరామ్ జయంతి


ప్రత్తిపాడులో సీనియర్ రైతును సన్మానిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో బలరాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ముస్సిబ్‌వారి రామాలయం వద్ద బలరామ జయంతిని పురస్కరించుకుని బీకేఎస్ ఆధ్వర్యంలో కిసాన్ సంఘ జెండాను ఆవిష్కరించిన నాయకులు నాగలికి, బలరామ్ చిత్రపటానికి పూజలు చేశారు. విశిష్ట రైతులను సన్మానించారు. ఉత్తమ మహిళా రైతు రొంగల యమున, ఉత్తమ విశ్రాంత సైనికుడు కర్రి ధర్మరాజు, ఉత్తమ సంఘ సేవకుడు ముక్కు సుబ్రహ్మణ్యం, ఉత్తమ రైతు బి.శివనారాయణ, ఉత్తమ గోసేవకుడు మాదేపల్లి నాగేశ్వరరావు, ఉత్తమప్రకృతి రైతు బాదం రాజులను సన్మానించారు. బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా, నాయకులు సూర్యనారాయణ, కె.నాగేశ్వరరావు, పావని, లక్ష్మి, ఆకుల హరిబాబు, పెదిరడ్ల గంగారావు, సింగిలిదేవ్ సత్తిరాజు, అప్పారావు పాల్గొన్నారు.

పట్టించుకోవడం లేదంటూ కౌన్సిలర్ల ఆగ్రహం

- కమిషనర్‌పై కౌన్సిల్ ఆగ్రహం




తుని కౌన్సిల్ సమావేశం దృశ్యం

తునిరూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తుని కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తుని మున్సిపాలిటీలో కౌన్సిలర్లకు కనీస మర్యాద లేదని.. కౌన్సిలర్ చెప్పిన ఏ పని కూడా ఏ అధికారి చేయడంలేదని, బయట వ్యక్తులకు ఉన్న విలువ మాకులేదని ధ్వజమెత్తారు. ఇలా అయితే ఇక మేము కౌన్సిలర్లుగా కొనసాగడం దేనికి, ప్రజా సమస్యలు పరిష్కారం కాకపోతే ఇక మేము ఉండి దేనికి ఉండమంటారా రాజీనామా చేసి పొమ్మంటారా... అంటూ తుని మున్సిపాల్ కౌన్సిల్ సభ్యులు మూకుమ్మడిగా మాటల యుద్ధం చేశారు. మీకు పనిచేయడం చేతకాదని కమిషనర్ పైనే మండిపడ్డారు. తుని మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగింది. పది అంశాల అజెండాను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం కౌన్సిల్ సభ్యులు ఒక్కొక్కరు తుని మున్సిపాలిటీలోపాలనాపరమైన వైఫల్యాలను, కమిషనర్ వెంకట్రావు పనితీరును ఎండగట్టారు. తుని మున్సిపాలిటీలో కౌన్సిల్ సభ్యులు ఉత్సవ విగ్రహాల్లా మారారని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆచంట సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఇద్దరు సిబ్బంది అవకతవకలకు పాల్పడి కేసులు నమోదైనా ఇప్పటివరకు వారిపై తగిన చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. దీనిపై కమిషనర్ వెంకట్రావు స్పందిస్తూ మున్సిపల్ నిధుల్లో అవకతవకలకు పాల్పడిన సునీత అనే ఉద్యోగిపై చర్యలు తీసుకున్నామని, ఆమె ఆస్తి సీజ్ చేసేందుకు ఉన్నతాధికారులు అనుమతి కోరామన్నారు. సుల్తాన్ అనే ఉద్యోగి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని తుని పట్టణ సీఐకు లేఖ రాశామని చెప్పారు. దీంతో చైర్‌పర్సన్ భువన కలగజేసుకుని తనకు చెప్పకుండా మున్సిపాలిటిలో ఏవేవో జరిగిపోతున్నాయని, సీఐకు లేఖ రాసిన విషయం తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో లేవనెత్తిన అన్ని సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరించి తదుపరి సమావేశంలో కౌన్సిలర్లకు ఆ విషయాన్ని తెలియజేయాలని సూచించారు.

రైతులకు అందుబాటులో యూరియా


గండేపల్లి సొసైటీలో ఎరువులను రైతులకు అందజేస్తున్న దృశ్యం

గండేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):గత కొన్ని రోజులుగా పలు కారణాలతో యూరియా ఎరువులు అందుబాటులోలేక రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు యూరియా ఎరువులు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. శుక్రవారం మండలంలో గండేపల్లి, మల్లేపల్లి, బొర్రంపాలెం, ఉప్పలపాడు సొసైటీలకు రైతు భరోసా కేంద్రాలకు సుమారు 40 టన్నులు యూరియా ఎరువులు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. దీంతో అధికారులు రైతులకు సమాచారం ఇచ్చి ఎరువులను అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏవో శ్రీరామ్ మాట్లాడుతూ ముందు వచ్చిన ఎరువులు స్టాకు వివరాలు నవరించడం కొద్దిగా లేట్ అవ్వడంతో ఎరువులు రావడం ఆలస్యమైందన్నారు. ఇకనుంచి యూరియా ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రస్తుతం 40 టన్నులు వచ్చిందని మరో రెండు రోజుల్లో వంద టన్నులు యూరియా రానుందన్నారు. కార్యక్రమంలో గండేపల్లి సొసైటీ అధ్యక్షుడు కంటిపూడి సత్యనారాయణ ఉన్నారు.

ఘనంగా చండీహోమం

అన్నవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా సాయి ప్రదీప్ ఎంపిక

ప్రదీప్‌ను సన్మానించిన ఎమ్మెల్యే


సాయి ప్రదీప్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గూగుల్‌సాఫ్ట్‌వేర్ సంస్థ దేశ వ్యాప్తంగా నిర్వహించిన గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్ ప్రోగ్రాంకు కాకినాడ జిల్లా ఏలేశ్వరానికి చెందిన సాయి ప్రదీప్ గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. రాష్ట్రంలో బీఆర్ అంబేద్కర్ విశ్వ విద్యాలయం నుంచి కృత్రిమ మేధస్సు (ఏఐ)లో గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా సాయి ప్రదీప్ ఎంపికై శుక్రవారం పెదశంకర్లపూడిలో ఎమ్మెల్యే సత్యప్రభను కలిసి ఎంపిక వివరాలు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే సత్యప్రభ సాయిప్రదీప్‌ను శాలువా కప్పి అభినందించారు. సాయిప్రదీప్‌కి గూగుల్ అంబాసిడర్ కిట్‌ను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో ఏలేశ్వరం వైద్యులు డాక్టర్ విజయబాబు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అనుసూరి నాగేశ్వరరావు, స్పార్క్ సభ్యులు రాహుల్, ప్రకృతి పరిరణ సభ్యుడు సహదేవుడు పాల్గొన్నారు.

డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా అంబేద్కర్ 78ఏళ్లు పూర్తి


అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న పీసీసీ సభ్యుడు కోట శ్రీను

ప్రత్తిపాడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా నియమించి 78ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ప్రత్తిపాడులోని కళామందిర్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పీసీసీ సభ్యుడు ధరాల కోట శ్రీను ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని రచించిన గొప్ప మేధావి అంబేద్కర్ అని, ఆయన ఆశయ సాధనకు యువత కృషి చేయాలని శ్రీను కోరారు. కార్యక్రమంలో కందిమళ్ళ శామ్యూల్, దాసరి సత్తిబాబు, స్వర్ణపూడి కోటేశ్వరరావు, మూరా రాంబాబు, మేడపాటి కృష్ణ, సూరిబాబు పాల్గొన్నారు.

డీఎస్సీలో ఇందుకూరు వాసి విజయం

దేవీపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఇందుకూరుకు చెందిన గోపి డీఎస్సీలో విజయం సాధించాడు. తండ్రి శత్రుచర్ల రామభద్రరాజు రంపచోడవరం జీసీసీలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంచేసి రిటైర్ అయ్యారు. తల్లి గృహిణి. పెద్ద చెల్లి అనూష ఇంజనీర్ అసిస్టెంట్‌గా సచివాలయం ఉద్యోగం చేస్తున్నారు. చిన్న చెల్లి శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఉద్యోగి.